RNI : APTEL/25/A0108

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 12, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8, వెల రూ. 5, /- బుధవారం - 15 - ఏప్రిల్ - 2026

published From : YSR Kadapa. circulated by Kurnool I Anantapuram I Chitoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad and Telangana

## బిహార్ సీఎం పదవికి నితీశ్ కుమార్ రాజీనామా



పట్నా: బిహార్ సీఎం పదవికి నితీశ్ కుమార్ మంగళవారం రాజీనామా చేశారు. బిహార్ గవర్నర్‌కు ఆయన రాజీనామా సమర్పించారు. క్యాబినెట్‌ను రద్దు చేస్తూ నితీశ్ నిర్ణయం తీసుకున్నారు. దాదాపు 21 ఏళ్ల పాటు సీఎం పదవిలో కొనసాగారు నితీశ్. ఇటీవలే ఆయన రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. అన్ని వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పని చేసిందని నితీశ్ కుమార్ రాజీనామా తర్వాత ఎక్స్‌లో తెలిపారు. మిగతా.. 2లో

## బిహార్ కొత్త సీఎం ఈయనే.. అధికారిక ప్రకటన




పట్నా: బిహార్ సీఎంగా నితీశ్ కుమార్ మంగళవారం రాజీనామా చేయడంతో కొత్త ముఖ్యమంత్రిగా ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత సామ్రాట్ చౌదరి పేరును ఎన్డీఏ ప్రకటించింది. పట్నాలో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ శాసనసభ పక్ష నాయకుడిగా సామ్రాట్ చౌదరిని ఎన్నుకున్నారు. సామ్రాట్ చౌదరి బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు ఏర్పాట్లు చేసుకోనున్నారు. త్వరలో గవర్నర్‌ను కలిసి తదుపరి ప్రభుత్వం ఏర్పాటుకు విజ్ఞప్తి చేయనున్నారు. బుధవారం ఏప్రిల్ 15న సీఎంగా సామ్రాట్ చౌదరి బాధ్యతల

## స్టాలిన్ 'ఫైనల్ వార్నింగ్' కు కౌంటర్ ఇచ్చిన అన్నామలై




ఢిల్లీ: నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియపైతమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్రాన్ని ఉద్దేశిస్తూ చేసిన 'ఫైనల్ వార్నింగ్' ప్రకటనపై తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించేందుకే స్టాలిన్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, కేంద్రంపై ఆయన చేసిన హెచ్చరికలు ఏమాత్రం సరికాదని మంగళవారం ఘాటుగా స్పందించారు.

# ఐలాపూర్ హైడ్రా కూల్చివేతలపై గందరగోళం

హైడ్రా చేపట్టిన కూల్చివేతలపై తీవ్ర గందరగోళం

ఐలాపూర్‌లో ఓ భారీ భవనంపై కూల్చివేతపై కోర్టు స్టే

తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా




హైదరాబాద్/సంగారెడ్డి: అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో హైడ్రా చేపట్టిన కూల్చివేతలపై తీవ్ర గందరగోళం నెలకొంది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత దాకా ఆపరేషన్ నిలిపివేయాలని తెలంగాణ హైకోర్టు స్పష్టంగా ఆదేశించింది. అయినప్పటికీ కూల్చివేతలు కొనసాగిస్తామని హైడ్రా అంటోంది. ఐలాపూర్‌లో ఓ భారీ భవనంపై కూల్చివేతపై కోర్టు


# మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం



హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదించిన ప్రోరేటా ప్రకారం నియోజకవర్గాల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోవడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళల సీట్ల సంఖ్య తగ్గి ఆ వర్గాలు నష్టపోతాయని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతిమ లక్ష్యం రాజ్యాధికారం సాధించడమే అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి ఆలోచనలకు విఘాతం కలుగుతున్న సందర్భంలో దళితులు, మేధావులు ఈ విషయంపై ఆలోచనలు చేయాలని పిలుపునిచ్చారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి 135 వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి గారు, మంత్రులు ప్రజాప్రతినిధులతో కలిసి ట్యాంక్‌బండ్ వద్ద ఆ మహనీయుడి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. "పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించి సమాజంలో సమాన విలువ, గౌరవం కల్పించిన నాయకుడు అంబేద్కర్ గారు. మహిళా రిజర్వేషన్లతో నియోజకవర్గాల పెంపును ముడిపెట్టి కలగాపులగం చేయాలని ప్రయత్నిస్తున్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతోంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పెంపు అని మొదట ప్రస్తావించారు. అభివృద్ధి చెందిన దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని అభ్యంతరం వ్యక్తం చేస్తే దామాషా ప్రకారం 50 శాతం పెంచుతామని చెబుతున్నారు. ఆ ప్రాతిపదిక ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరాలను పెంచుతుంది. దక్షిణాదిలో సీట్లు తగ్గడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళలకు రిజర్వుడు సీట్లు తగ్గుతాయి. ఏ లెక్కన దక్షిణాది కోటాను తగ్గిస్తారు" అని ముఖ్యమంత్రి గారు ప్రశ్నించారు. "మహిళా రిజర్వేషన్ల పెంపుపై మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. చెప్పిన మాటపై నిలబడే ప్రభుత్వం మాది. చెప్పిన మాట ప్రకారం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చేసి చూపించిన రాష్ట్రం దేశంలో తెలంగాణ ఒక్కటే. కులగణన చేస్తామని చెప్పాం. చేసి చూపించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. మంచి పనికి తెలంగాణ ప్రభుత్వం ముందుంటుంది. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి చెప్పిన మాటలు ఆచరణలోకి రావాలంటే మన సీట్లను సాధించుకోవాలి. అప్పుడే మన హక్కుల కోసం మాట్లాడగలం. మేధావులు ఆలోచన చేయాలి" అని కోరారు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలకు సమాన అవకాశాలు కల్పించవచ్చని మార్గదర్శకం చేసిన మహానాయకుడు అంబేద్కర్ గారు. విద్య ఒక్కటే అన్ని సమస్యల నుంచి మనల్ని విముక్తి చేస్తుందని, జీవితాల్లో వెలుగులు నింపుతుందని, సమాజంలో సరైన గౌరవం దక్కుతుందని బలంగా విశ్వసించారు. అంబేద్కర్ గారి ఆలోచనే ప్రజాపాలన విధానం. రక్తం చిందించకుండా శాంతితో యుద్ధాన్ని గెలవొచ్చని మహాత్మగాంధీ గారు ప్రపంచ దేశాలకు చాటిచెబితే, ఆ దేశాన్ని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా పరిపాలించవచ్చని నిరూపించిన వారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారు. ఈ దేశానికి మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రెండు కళ్లలాంటి వారు. భారత రాజ్యాంగంలో అంబేద్కర్ గారు జోడించిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైంది. మిగతా.. 2లో

## ఢిల్లీ-డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్‌వేను ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఢిల్లీ-డెహ్రాడూన్ మధ్య ఎక్స్‌ప్రెస్‌వే ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. సుమారు 11,868 కోట్లతో చేపట్టిన ఆ ప్రాజెక్టులో భాగంగా 212 కిలోమీటర్ల మేర ఎక్స్‌ప్రెస్ వే నిర్మించారు. ఢిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్‌గా కూడా పిలుస్తున్న ఈ మార్గం చార్‌ధామ్ యాత్రికులకు కీలకమార్గం కానున్నది. ఢిల్లీ-డెహ్రాడూన్ ఆర్థిక కారిడార్ ఢిల్లీ, డెహ్రాడూన్ మధ్య ప్రయాణ సమయాన్ని 6 గంటలకు పైగా నుండి సుమారు 2.5 గంటలకు తగ్గిస్తుంది. మానవ-జంతు సంఘర్షణను గణనీయంగా తగ్గించే లక్ష్యంతో దీనిని అనేక అత్యాధునిక ఫీచర్లతో రూపొందించారు. ఈ ప్రాజెక్టులో 12 కిలోమీటర్ల పొడవైన వన్యప్రాణుల ఎలివేటెడ్ కారిడార్ కూడా ఉంది. ఇది ఆసియాలోనే అత్యంత పొడవైన వాటిలో ఒకటి. దీని ప్రారంభోత్సవానికి ముందు ప్రధానమంత్రి డెహ్రాడూన్ సమీపంలోని మా దాత్ కాళీ ఆలయాన్ని సందర్శించి, అక్కడ ప్రార్థనలు చేశారు. వేగవంతమైన ప్రయాణం, మెరుగైన కనెక్టివిటీ ఫీచర్లతో కొత్తగా ప్రారంభించిన ఈ కారిడార్ ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ ,ఉత్తరాఖండ్ గుండా వెళుతుంది. ఆరు లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేగా నిర్మించిన ఈ కారిడార్ సులభమైన, హై-స్పీడ్ ప్రయాణాన్ని అందిస్తుంది.



## కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాట కార్యాచరణ: కేటీఆర్ కీలక ప్రకటన




## రేవంత్ వ్యాఖ్యలు అంబేద్కర్ ఆశయాలకు వ్యతిరేకం: కిషన్ రెడ్డి




కాంగ్రెస్ వ్యతిరేకంగా పుట్టిన పార్టీ టీడీపీ


దేశంలో రాహుల్ గాంధీ తర్వాత అంతటి మేధావి రేవంత్ రెడ్డినేనని కిషన్ రెడ్డి ఎద్దేవా

రేవంత్ రెడ్డి వితండవాదలు పక్కన పెట్టాలని కిషన్ రెడ్డి హితవు

అద్దాల మేడలో కూర్చుని సీఎం రేవంత్ రెడ్డి రాళ్లు వేయడం మంచిది కాదని హితవు

ఢిల్లీ,: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. సీఎం రేవంత్ రెడ్డి బంట్రోతు పోస్ట్ దొరకదని అంటున్నారని.. ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా అని ఆగ్రహించారు. ఢిల్లీ వేదికగా మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వండి: ఏపీలోని అన్ని పార్టీలకు సీఎం చంద్రబాబు లేఖ



'నారీ శక్తి వందన్ అధినియం'పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ముందడుగు

అమరావతి: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 'నారీ శక్తి వందన్ అధినియం'పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ముందడుగు వేశారు. ఈ చారిత్రక బిల్లుకు సంపూర్ణ మద్దతు కూడగట్టే లక్ష్యంతో మిగతా.. 2లో

# క్వాంటంతో డీప్ టెక్ రంగంలో సీఎం చంద్రబాబు ముందడుగు

## -కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి ప్రశంస

- ★ అమరావతిలో ప్రారంభమైన దేశంలోని తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీలు
- ★ ఐటీ తర్వాత డీప్ టెక్ రంగంపై సీఎం చంద్రబాబు దృష్టి సారించారని ప్రశంసలు
- ★ భవిష్యత్తులో ఏఐ, క్వాంటం రంగాలకు అమరావతి హబ్‌గా మారుతుందన్న నిపుణులు
- ★ దేశీయంగా క్వాంటం హార్డ్‌వేర్ తయారీ, ధ్రువీకరణలో ఈ కేంద్రాలు కీలకం
- ★ నేషనల్ క్వాంటం మిషన్‌లో భాగంగా పూర్తి స్వదేశీ టెక్నాలజీతో ఏర్పాటు



అమరావతి: క్వాంటం టెక్నాలజీ రంగంలో ఏపీలో చారిత్రాత్మక ముందడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసిన క్వాంటం రిఫరెన్స్ టెస్టింగ్ ఫెసిలిటీల ప్రారంభోత్సవంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి అభయ్ కరాందికర్ పాల్గొన్నారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సౌకర్యాలు అందుబాటులోకి రావడం, క్వాంటం విప్లవంలో దేశం ఇస్తున్న ఒక బలమైన సందేశమని ఆయన అభివర్ణించారు. ఈ ఫెసిలిటీల ప్రారంభం, దేశాన్ని సాంకేతికంగా సార్వభౌమ దేశంగా, వికసిత్ భారత్‌గా మార్చే లక్ష్యంలో కీలకమైన ముందడుగు అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అభయ్ కరాందికర్ మాట్లాడుతూ, ఐటీ రంగాన్ని సమర్థంగా అందిపుచ్చుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇప్పుడు భవిష్యత్ టెక్నాలజీ అయిన డీప్ టెక్ రంగంలోనూ ముందుచూపుతో ముందడుగు వేశారని ప్రశంసించారు. భవిష్యత్ టెక్నాలజీలను ప్రోత్సహించడం ద్వారా పెట్టుబడులు, ప్రగతిని వేగంగా సాధించే అవకాశం ఉంటుందని అన్నారు. పూర్తి స్వదేశీ టెక్నాలజీతో ఈ క్వాంటం టెస్ట్ బెడ్‌లను నిర్మించడం ద్వారా డీప్ టెక్ స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు పునాది పడిందని వివరించారు. క్వాంటం కంప్యూటర్ హార్డ్‌వేర్ తయారీ, మిగతా.. 2లో

## దివ్యాంగ విద్యార్థుల ఎవరెస్ట్ సాహసయాత్ర... జెండా ఊపి ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్




- ❖ సమాజం మిమ్మల్ని గౌరవించేలా, సొంత పిల్లల్లా చూసుకునేలా మీరు ఎదగాలి"
- ❖ మంత్రి లోకేశ్ విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై ముఖాముఖి నిర్వహించారు
- ❖ విద్యార్థులతో ఇలాంటి సాహసయాత్ర నిర్వహించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం
- ❖ ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్య, దివ్యాంగుల ప్రోత్సాహం, అభ్యసన ఫలితాలపై ప్రత్యేక దృష్టి

అమరావతి: కసి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని, ఎదురయ్యే సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దేశ చరిత్రలోనే ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక అవసరాలు గల 21 మంది దివ్యాంగ విద్యార్థుల బృందం

## ఇలా చేస్తే అమరావతికి తిరుగుండదు.. ప్రభుత్వానికి విజయసాయిరెడ్డి కీలక సూచనలు




- ▶▶ అమరావతి నిర్మాణంపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు
- ▶▶ రాజధాని నగరం అప్పులతో కాకుండా బలంతో ఎదగాలని ఆయన అభిప్రాయపడ్డారు
- ▶▶ ఆదాయం రాని ప్రాజెక్టులకు రుణాలు తేవడం మంచిది కాదు
- ▶▶ ఖర్చు చేసే ప్రతి రూపాయి, భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలపై పెను భారం

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



# బిహార్ సీఎం పదవికి నితీశ్ కుమార్ రాజీనామా

మొదటి పేజీ తరువాయి

అన్ని వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పని చేసిందని నితీశ్ కుమార్ రాజీనామా తర్వాత ఎక్స్‌లో తెలిపారు. “హిందువులు, ముస్లింలు, ఉన్నత వర్ణాలు, వెనుకబడిన వర్గాలు, అత్యంత వెనుకబడిన వర్గాలు, దళితులు, మహాదళితులు.. ఇలా ప్రతి ఒక్కరి కోసం మా ప్రభుత్వం పనిచేసింది. విద్య, ఆరోగ్యం, రహదారులు, విద్యుత్, వ్యవసాయం వంటి ప్రతి రంగంలో అభివృద్ధి పనులు జరిగాయి. మహిళలు, యువత కోసం ఎంతో చేశాం” అని నితీశ్ చెప్పారు. కాగా, నితీశ్ కుమార్ మంగళవారం క్యాబినెట్ సమావేశం నిర్వహించారు. నితీశ్ కుమార్ క్యాబినెట్‌కు ఇదే చివరి సమావేశం.

సీఎంగా సామ్రాట్ చౌదరి?

బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత సామ్రాట్ చౌదరి బుధవారం (ఏప్రిల్ 15న) బాధ్యతలు చేపట్టే ఛాన్స్ ఉంది. నితీశ్ శాసన మండలి సభ్యత్వానికి గత నెల 30న రాజీనామా చేశారు. ఢిల్లీ బీజేపీ ప్రధాన కార్యాలయం ఇటీవల ఓ ప్రకటన విడుదల చేసింది. కేంద్ర మంత్రి, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను బిహార్‌లో శాసనసభ పక్ష నాయకుడిని ఎన్నుకునేందుకు కేంద్ర పరిశీలకుడిగా నియమించినట్లు తెలిపింది. జేడీయూ సీనియర్ నేత విజయ్ కుమార్ చౌదరి మాట్లాడుతూ.. “బీజేపీ సిఫారసుపై ఎన్డీఏ కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకుంటుంది, ఇందులో బీజేపీకి పెద్ద పాత్ర ఉంది” అని అన్నారు. జేడీయూ వర్కింగ్ ప??రెసిడెంట్, రాజ్యసభ సభ్యుడు సంజయ్ కుమార్ ఝా ఇటీవల మాట్లాడుతూ.. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవిలో లేకపోయినా, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన కృషి కొనసాగుతుందని తెలిపారు. గత బిహార్ ఎన్నికల్లో నితీశ్ కుమార్ నాయకత్వంలో, ఎన్డీఏ మద్దతుతో పార్టీ పోటీ చేసిందని తెలిపారు. కొత్త ప్రభుత్వం నితీశ్ విధానాలను, పాలనా మోడల్‌ను కొనసాగిస్తుందని అన్నారు.

# బిహార్ కొత్త సీఎం ఈయనే.. అధికారిక ప్రకటన

మొదటి పేజీ తరువాయి

త్వరలో గవర్నర్‌ను కలిసి తదుపరి ప్రభుత్వం ఏర్పాటుకు విజ్ఞప్తి చేయనున్నారు. బుధవారం ఏప్రిల్ 15న సీఎంగా సామ్రాట్ చౌదరి బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది.

సామ్రాట్ చౌదరి ఎవరు?

సామ్రాట్ చౌదరి 1968 నవంబర్ 16న ముంగేర్ జిల్లాలో జన్మించారు. ఆయనకు బలమైన రాజకీయ వారసత్వం ఉంది. ఆయన తండ్రి శకుని చౌదరి తారాపూర్ నియోజకవర్గం నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన తల్లి పార్వతీ దేవి 1998లో అదే స్థానంలో అప్పటి సమతా పార్టీ తరపున గెలిచారు. గత 12 ఎన్నికల్లో 9 సార్లు తండ్రి, తల్లి, కుమారుడు కలిసి ఆ స్థానంలో గెలిచారు. సామ్రాట్ చౌదరికి 57 ఏళ్లు 1990లో రాజకీయ ప్రవేశం చేశారు. 1999లో లాలూ ప్రసాద్ యాదవ్ భార్య రబ్రీదేవి ప్రభుత్వం నడిపిన సమయంలో, బీజేపీ మిత్రపక్షంగా ఉన్నప్పుడు సామ్రాట్ వ్యవసాయ మంత్రి అయ్యారు. 2000, 2010 ఎన్నికల్లో పర్బట్టా అసెంబ్లీ స్థానంలో గెలిచారు. 2010లో బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చీఫ్ విప్‌గా ఉన్నారు. 2023 మార్చి నుంచి 2024 జూలై వరకు బీజేపీ బిహార్ యూనిట్ అధ్యక్షుడిగా పనిచేశారు. రాష్ట్రంలో క్రీడలు, ఆర్థిక, పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి-గృహ నిర్మాణ శాఖల మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

సీఎం రేసులో కీలక నేతలు

సీఎం పదవికి అవసరమైన రాజకీయ, పరిపాలనా అనుభవం ఆయనకు ఉంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాలు వంటి అన్ని అంశాల్లో అనుభవం ఉంది. ఆయన కుశ్వాహా సామాజిక వర్గానికి చెందినవారు. ఇది రాష్ట్ర జనాభాలో సుమారు 4.3 శాతం. బిహార్‌లో యాదవుల తర్వాత అతిపెద్ద ఓబీసీ వర్గం ఇదే.

# స్టాలిన్ ‘ఫైనల్ వార్నింగ్’ కు కౌంటర్ ఇచ్చిన అన్నామలై

మొదటి పేజీ తరువాయి

ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించేందుకే స్టాలిన్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, కేంద్రంపై ఆయన చేసిన హెచ్చరికలు ఏమాత్రం సరికాదని మంగళవారం ఘాటుగా స్పందించారు. ఈ విషయంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు వెళ్తుందని, స్టాలిన్ ఆందోళనలు నిరాధారమైనవని కొట్టిపారేశారు. ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ రాజకీయ వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సమావేశాల్లో మహిళలకు పార్లమెంటులో మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించే “నారీ శక్తి వందన్ అధినియమ్” సవరణలతో పాటు, ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లుపై చర్చ జరగనుంది. ఈ క్రమంలోనే సీఎం స్టాలిన్ ఒక వీడియో సందేశం విడుదల చేశారు. పునర్విభజన ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కేంద్రం మార్గదర్శకాలకు అనుగుణంగా జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన తమిళనాడు వంటి రాష్ట్రాలు ఇప్పుడు నష్టపోయే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ ప్రయోజనాలకు భంగం వాటిల్లితే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంపై కూడా ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. స్టాలిన్ వ్యాఖ్యలపై అన్నామలై తీవ్రంగా స్పందించారు. “ముఖ్యమంత్రి ప్రజల మనసుల్లో విభేదాలు సృష్టించి, భయాన్ని నూరిపోయాలని చూడటం చాలా దురదృష్టకరం. తమిళనాడు మళ్లీ 1960ల నాటి పరిస్థితులకు వెళుతుందని, ప్రధానిని బెదిరించేలా ఆయన ఉపయోగించిన భాష ఆమోదయోగ్యం కాదు” అని అన్నామలై అన్నారు. ప్రధాని మోదీ అందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. డీలిమిటేషన్ పెంపు పూర్తిగా జనాభా ఆధారంగా ఉంటుందని కేంద్రం ఎక్కడా చెప్పలేదని అన్నామలై స్పష్టం చేశారు. “తమిళనాడు ముఖ్యమంత్రి సమస్య ఏంటి? మేం ఎక్కడా జనాభా ఆధారంగానే పెంపు ఉంటుందని చెప్పలేదు. అందరినీ కలుపుకొనిపోతామని చెప్పాం. ఏడాది క్రితం కోయంబత్తూరులో కేంద్ర హోంమంత్రి మాట్లాడుతూ.. పెంపు ప్రో-రాటా (అనుపాత) పద్ధతిలో ఉంటుందని, తద్వారా ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని హామీ ఇచ్చారు. అయినప్పటికీ, సీఎం స్టాలిన్ ఇలాంటి వీడియో విడుదల చేయడం ఆయన రాజ్యాంగంపై చేసిన ప్రమాణానికి విరుద్ధం” అని అన్నామలై విమర్శించారు.

ఏమిటీ ‘ప్రో-రాటా’ విధానం? కేంద్రం ఏం చెబుతోందంటే...!

సాధారణంగా నియోజకవర్గాల పునర్విభజన తాజా జనాభా లెక్కల ఆధారంగా జరగాలి. కానీ, ‘ప్రో-రాటా’ విధానంలో అలా కాకుండా, ప్రస్తుతం ఏ రాష్ట్రానికి ఎన్ని సీట్లు ఉన్నాయో అదే నిష్పత్తిలో కొత్త సీట్లను పెంచుతారు. ఉదాహరణకు, అన్ని రాష్ట్రాలకు ఏకరీతిగా 50 శాతం సీట్లు పెంచితే, 80 సీట్లున్న ఉత్తరప్రదేశ్‌కు 120, 39 సీట్లున్న తమిళనాడుకు దాదాపు 59 సీట్లు వస్తాయి. జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసి నష్టపోతామని భావిస్తున్న దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను తగ్గించేందుకే కేంద్రం ఈ ఫార్ములాను పరిశీలిస్తున్నట్లు చెబుతోంది.

# ఐలాపూర్ హైడ్రా కూల్చివేతలపై గందరగోళం

మొదటి పేజీ తరువాయి

ఐలాపూర్‌లో ఓ భారీ భవనంపై కూల్చివేతపై కోర్టు సోమవారం స్టే ఆర్డర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే.. భవనం పూర్తిగా కూల్చకుండా వదిలేసింది హైడ్రా. కూల్చకుండా వదిలేస్తే పక్కన ఉన్న భవనంపై పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో పూర్తిగా కూల్చాల్సిందేనని అంటున్నారు. కానీ.. హైడ్రా చర్య కోర్టు ధిక్కరణ(కంటెంప్ట్ ఆఫ్ కోర్టు) కిందకే వస్తుందని బాధితులు చెబుతున్నారు. ఒకవేళ మొండిగా కూల్చివేతలు మొదలుపెడితే మరోసారి న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెబుతున్నారు.

ఏం జరిగిందంటే..

శనివారం అమీన్‌పూర్ మండల పరిధిలో పలు చోట్ల అక్రమ కట్టడాలను కూల్చేసింది హైడ్రా. ఆ సమయంలోనూ విపరీతమైన గందరగోళం నెలకొంది. కోర్టు ఆదేశాలతో కూల్చివేత ఆగిందని కాసేపు.. హైడ్రానే కావాలని కాసేపు కూల్చివేతలు ఆపిందని.. ఇలా రకరకాల ప్రచారం జరిగింది. ఈలోపు ఐలాపూర్ కూల్చివేతలపై ఓ వృద్ధుడు హైకోర్టును ఆశ్రయించారు. మధ్యంతర ఉత్తర్వులు ఉన్నా కూడా పట్టించుకోకుండా కూల్చివేతకు దిగారని పేర్కొన్నారు. అయితే.. హైడ్రా తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) వాదిస్తూ.. కోర్టు ఇచ్చిన డిక్రీని అడ్డుపెట్టుకుని ఐలాపూర్‌లో పలు సర్వే నంబర్లలోని వెయ్యి ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని.. హైడ్రా కూల్చివేసిన భవనం ప్రభుత్వ భూమిలో నిర్మించిందేనని.. పైగా ఆ భవనానికి విద్యుత్, నిర్మాణ అనుమతులు లేవని వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న కోర్టు.. తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు జలాశయాలు, నాలాలు, పార్కులు, ఆక్రమణల తొలగింపు, ప్రజా రహదారుల పునరుద్ధరణ మినహా అనధికార నిర్మాణాల కూల్చివేత లేదంటే తొలగింపునకు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టవద్దని ఆదేశించింది. తదుపరి విచారణ ఈ నెల 20కి వాయిదా వేసింది.

# కాంగ్రెస్ వైఫల్యాలపై పోరాట కార్యాచరణ – కేటీఆర్ కీలక ప్రకటన

హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై రాబోయే పోరాటాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 20న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అధినేత కేసీఆర్ హాజరుకానున్నారని కేటీఆర్ తెలిపారు. అనంతరం ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. మే, జూన్ నెలల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలపై తొలుత దృష్టి సారించబోతున్నట్లు స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన డిక్లరేషన్లను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. ఏయే ప్రాంతాల్లో ఏయే హామీలు ఇచ్చారో, తిరిగి అదే ప్రాంతాల్లో సభలు పెట్టి ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయాల కోసమే వాడుకుందని మండిపడ్డారు. అంబేద్కర్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవడమే కాకుండా, ఆయనకు భారతరత్న ఇవ్వడంలోనూ, పార్లమెంటులో ఫొటో పెట్టడంలోనూ కాంగ్రెస్ నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని సందర్శించకుండా గేట్లు వేస్తే, తాము హెచ్చరించిన తర్వాతే గేట్లు తెరుచుకున్నాయని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎస్సీ, ఎస్టీలు మోసపోయారని, వెయ్యికి పైగా గురుకులాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ అరాచక పాలనపై బీఆర్ఎస్ గట్టిగా నిలదీస్తుందని అన్నారు.

# మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

మొదటి పేజీ తరువాయి



భారత రాజ్యాంగంలో అంబేద్కర్ గారు జోడించిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైంది. తెలంగాణ ఉద్యమంలో దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలే ముందు భాగంలో నిలిచి పోరాటం చేశారు. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన గద్దరన్న, మారుమూల పల్లెల్లో జయ జయహే తెలంగాణను మారుమోగించిన అందెశ్రీ గార్లను” ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు స్మరించుకున్నారు. దళిత, గిరిజన సామాజిక వర్గానికి మంత్రిపదవులు, ఇతర పదవులు, అధికారులకు ప్రాధాన్యత విషయాల్లో గత ప్రభుత్వాలకు, ప్రజాప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను పోల్చుకోవాలని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలోనే అత్యధిక ప్రాధాన్యత దక్కిందని అనేక ఉదాహరణలు చెప్పారు. కులాల మధ్యన విభజన జరుగుతుందని, సమాజంలో మరింతగా అంతరాలు పెరుగుతున్నాయని ఆలోచన చేసి ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. దేశానికి భవిష్యత్తును అందించే దళిత, గిరిజన, మైనారిటీ వర్గాల పేదలకు నాణ్యమైన విద్య అందడం లేదని, నాణ్యమైన విద్యను అందించడానికి అంబేద్కర్ గారి ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. “రాష్ట్రంలో ఇచ్చిన 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లలో అత్యధికంగా దళితులకు ఇచ్చాం. 67 వేల ప్రభుత్వ ఉద్యోగాలు నియమిస్తే అందులో 87 శాతం ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు ఉద్యోగాలొచ్చాయి. సివిల్ సర్వీసెస్ లో ప్రోత్సహించాలని రాజీవ్ గాంధీ అభయహస్తం కింద ఆర్థిక సహాయం అందిస్తున్నాం. ఒకవైపు అప్పులు, తప్పులను సవరిస్తూనే రాష్ట్రంలో పరిపాలనను చక్కబెడుతూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి అందించాలన్న మంచి లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఈ ప్రభుత్వం మనది. ప్రజల కోసం అందిస్తున్న ప్రజాపాలనను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉంది” అని ముఖ్యమంత్రి గారు కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ గారు, ధనసరి అనసూయ సీతక్క గారు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారితో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ వ్యాఖ్యలు అంబేద్కర్ ఆశయాలకు వ్యతిరేకం: కిషన్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి



ప్రజలను బంట్రోతులుగా చూస్తున్నారా అని ఆగ్రహించారు. ఢిల్లీ వేదికగా మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ వ్యతిరేకంగా పుట్టిన పార్టీ టీడీపీ అని తెలిపారు. తెలుగువారి ఆత్మగౌరవంగా టీడీపీ పుట్టిందని ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి ఇద్దరు ఉపరాష్ట్రపతులుగా ఉన్నారని ప్రస్తావించారు. వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా పని చేశారని, తాను ఒక్కడినే మేధావిని అనుకుని అద్దాల మేడలో కూర్చుని సీఎం రేవంత్ రెడ్డి రాళ్లు వేయడం మంచిది కాదని హితవు పలికారు. ఇందిరా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. దేశం మొత్తం ఒకటి కాదా అని ప్రశ్నించారు.

వారు ఎక్కడి నుంచి పోటీ చేశారు..?

లక్ష్మణ్ వలస పోయారని రేవంత్ రెడ్డి అంటున్నారని.. మరి ఇందిరాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ ఎక్కడి నుంచి పోటీ చేశారని కిషన్ రెడ్డి నిలదీశారు. కాంగ్రెస్‌ను రాహుల్ గాంధీ బుద్ధితో నడిపిస్తే, రేవంత్ రెడ్డి డబ్బులతో నడిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కి అధికారికంగా కోశాధికారిగా పని చేస్తున్నారని సెటైర్లు గుప్పించారు. డీలిమిటేషన్‌తో ఎన్ని సీట్లు పెరుగుతాయనేది పార్లమెంట్ సమావేశాల్లో తెలుస్తోందని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి హైబ్రిడ్, జీడీపీ పరంగా సీట్లు పెరగాలని అంటున్నారని, ప్రపంచలో ఇది ఎక్కడ లేదని అన్నారు. అలాంటప్పుడు అసెంబ్లీ సీట్లు ఆదిలాబాద్, ఖమ్మంలో తగ్గిస్తారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. హైదరాబాద్‌లో మాత్రమే సీట్లు పెంచుతారా..? అనేది రేవంత్ రెడ్డి చెప్పాలని నిలదీశారు. 70 శాతం రెవెన్యూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచే వస్తోందని తెలిపారు.

రేవంత్ రెడ్డి వితండవాదలు పక్కన పెట్టాలి..

దేశంలో రాహుల్ గాంధీ తర్వాత అంతటి మేధావి రేవంత్ రెడ్డినేనని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభజన తీసుకొచ్చే విధంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి తప్పుడు మాటలు మాట్లాడొద్దని, వాస్తవాలు మాట్లాడాలని సూచించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి వితండవాదలు పక్కన పెట్టాలని కిషన్ రెడ్డి హితవు పలికారు.

# సీడబ్ల్యూసీలో పార్లమెంటు వ్యూహాలపై అగ్ర నేతల చర్చ

మొదటి పేజీ తరువాయి




తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు.

చర్చకు రానున్న ప్రధాన అంశాలు..

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై తన వాణిని వినిపించాలని నిర్ణయించింది.

మహిళా రిజర్వేషన్ బిల్లు: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరిని ఖరారు చేయనుంది. ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చించారు.

నియోజకవర్గాల పునర్విభజన: 2026 తర్వాత జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య తమ వాదనలు వినిపించారు.

పశ్చిమాసియా సంక్షోభం: అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై చర్చించారు.

పార్లమెంటు వ్యూహం: కేవలం మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లులను ఎలా అడ్డుకోవాలి లేదా చర్చలో ఎలా పైచేయి సాధించాలనే అంశంపై సభ్యులకు కాంగ్రెస్ అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు.

రాజకీయ ప్రాధాన్యం

రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం అనూహ్యంగా ప్రత్యేక సమావేశాలను పిలవడంతో ఈ జబౌజ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ బలోపేతంపై సీఎం రేవంత్‌రెడ్డి సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక ప్రసంగం చేసే అవకాశం ఉంది.

ఎన్నికల ప్రయోజనాల కోసమే పార్లమెంట్ సమావేశాలు: మల్లికార్జున ఖర్గే

సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎన్నికల ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టతని ఇచ్చామని, కేంద్రాన్ని డిమాండ్ కూడా చేశామని ప్రస్తావించారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగుతున్న వేళ హఠాత్తుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు సవరణ , పునర్విభజన చట్టం సవరణ బిల్లులను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక అఖిలపక్ష సమావేశం పెట్టాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీలన్నీ కోరాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాల కోసం ప్రయత్నం చేస్తుందని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# క్వాంటంతో డీప్ టెక్ రంగంలో సీఎం చంద్రబాబు ముందడుగు -కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ కార్యదర్శి ప్రశంస

మొదటి పేజీ తరువాయి



క్వాంటం కంప్యూటర్ హార్డ్‌వేర్ తయారీ, సర్టిఫికేషన్‌లో ఈ రిఫరెన్స్ ఫెసిలిటీలు ఒక బెంచ్‌మార్క్‌గా నిలుస్తాయని, నేషనల్ క్వాంటం మిషన్‌ను మరింత ముందుకు తీసుకువెళ్తాయని ఆయన తెలిపారు. కేవలం ఉపకరణాలు మాత్రమే కాకుండా, క్వాంటం కంప్యూటింగ్ ద్వారా కమ్యూనికేషన్, ఫైనాన్స్, డిజైన్లు, ప్రెసిషన్ సెన్సింగ్ వంటి కీలక రంగాల్లో నూతన ఆవిష్కరణలు రావాల్సి ఉందని ఆకాంక్షించారు. ఈ రంగంలో మానవ నైపుణ్యాలను పెంచేందుకు జాతీయ స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయని, క్వాంటం నిపుణులను తయారు చేయడంలో ఏపీ ముందంజలో ఉండటం అభినందనీయమని అన్నారు. ప్రైవేటు రంగంలో జరిగే పరిశోధనల కోసం నేషనల్ క్వాంటం మిషన్ ద్వారా ప్రత్యేక నిధి కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.

చంద్రబాబు వేగాన్ని దేశమంతా అందుకోవాలి: అజయ్ కుమార్ సూద్

ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రసంగించిన కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సలహాదారు అజయ్ కుమార్ సూద్, ముఖ్యమంత్రి చంద్రబాబును “విజనరీ సీఎం”గా అభివర్ణించారు. క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీల ద్వారా చంద్రబాబు క్వాంటం రంగంలో విప్లవాన్ని అందిపుచ్చుకున్నారని కొనియాడారు. క్వాంటం టెక్నాలజీలో స్వయం సమృద్ధి సాధించడంలో ఇది కీలకమైన ముందడుగని, భవిష్యత్తులో అమరావతి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్వాంటం రంగాల్లో దేశానికి హబ్‌గా మారుతుందని జోస్యం చెప్పారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో సీఎం చంద్రబాబు చూపిస్తున్న వేగం దేశవ్యాప్తంగా ప్రతిఫలించాలని ఆకాంక్షించారు. ఐటీ రంగంలో ప్రపంచానికి మన సత్తా చాటినట్లే, క్వాంటం రంగంలోనూ నిపుణులను సత్వరం సిద్ధం చేసుకోవాలని సూచించారు. అమరావతి క్వాంటం వ్యాలీ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ కీలక ముందడుగు వేసిందని, ఈ ప్రయాణాన్ని సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ డెవలప్‌మెంట్‌తో పాటు ఇతర ఆవిష్కరణలకు కూడా విస్తరించాలని కోరారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వండి ఏపీలోని అన్ని పార్టీలకు సీఎం చంద్రబాబు లేఖ

ఈ చారిత్రక బిల్లుకు సంపూర్ణ మద్దతు కూడగట్టే లక్ష్యంతో ఆయన రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు మంగళవారం లేఖ రాశారు. రాబోయే 2029 ఎన్నికల నుంచే ఈ రిజర్వేషన్లు అమల్లోకి తీసుకురావాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షను అందరూ కలిసికట్టుగా బలపరచాలని తన లేఖలో చంద్రబాబు గట్టిగా విజ్ఞప్తి చేశారు. ఈ నెల 16న పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును ప్రవేశపెట్టడం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోతుందని చంద్రబాబు తన లేఖలో అభిప్రాయపడ్డారు. “మహిళా రిజర్వేషన్ బిల్లుపై విస్తృతంగా చర్చలు జరిగాయి. త్వరితగతిన ఈ చారిత్రక చట్టం అమల్లోకి రావాలన్న ఏకాభిప్రాయం కూడా నాడు వ్యక్తమైంది. ఇందులో భాగంగా 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు కావాలన్న ప్రధాని నరేంద్ర మోదీ గారి ఆకాంక్షకు మనందరం మద్దతు పలుకుదాం” అని ఆయన కోరారు. ఈ అంశం రాజకీయాలకు అతీతమైనదని, దేశ గౌరవానికి సంబంధించిన విషయమని చంద్రబాబు స్పష్టం చేశారు. “మహిళా రిజర్వేషన్ పై అంతా ఒకే స్వరం వినిపించాలని ఆడబిడ్డల తరుపున బాధ్యతతో ఈ లేఖ రాస్తున్నాను. మన ఇంటి ఆడబిడ్డలను, మన దేశ మహిళలను గౌరవించుకునే ఈ అవకాశాన్ని మనందరం అదృష్టంగా భావిద్దాం. ఈ పవిత్ర ఘట్టంలో భాగస్వామి అయ్యే సందర్భాన్ని ఎవరూ వదులుకోవద్దు” అని ఆయన హితవు పలికారు. ప్రతీ పార్టీ, ప్రతీ ఎంపీ ఈ చారిత్రాత్మక నిర్ణయంలో తమదైన ముద్ర వేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. ప్రభుత్వంలో, పరిపాలనలో, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుందని తాను బలంగా విశ్వసిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. ‘నారీ శక్తి వందన్ అధినియమ్’ కేవలం మహిళా సాధికారతకే కాకుండా, యావత్ దేశ ఉన్నతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. భరతమాతను పూజించే మన దేశంలో, నారీ శక్తికి వందనం పలికే ఈ గొప్ప క్షణాలకు 140 కోట్ల మంది భారతీయులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని చేకూర్చడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రధాని మోదీని, కేంద్ర ప్రభుత్వాన్ని సమష్టిగా బలపరచాలని చంద్రబాబు తన లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

# దివ్యాంగ విద్యార్థుల ఎవరెస్ట్ సాహసయాత్ర... జెండా ఊపి ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

మొదటి పేజీ తరువాయి

ప్రత్యేక అవసరాలు గల 21 మంది దివ్యాంగ విద్యార్థుల బృందం చేపట్టనున్న నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్రను మంత్రి లోకేశ్ మంగళవారం ఉండవల్లిలోని తన నివాసంలో జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులతో ఇలాంటి సాహసయాత్ర నిర్వహించడం దేశంలో ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ నెల ఏప్రిల్ 15 నుంచి 30వ తేదీ వరకు 16 రోజుల పాటు ఈ సాహసయాత్ర కొనసాగనుంది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న 21 మంది విద్యార్థులు (8 మంది బాలికలతో సహా) ఈ బృందంలో ఉన్నారు. వీరంతా సముద్ర మట్టానికి 5,364 మీటర్ల ఎత్తులో ఉన్న ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించనున్నారు. ఏప్రిల్ 15న మధ్యాహ్నం ఈ బృందం నేపాల్ రాజధాని ఖాట్మండూకు చేరుకొని, అక్కడి నుంచి తమ యాత్రను ప్రారంభిస్తుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై ముఖాముఖి నిర్వహించారు. వారిలో స్ఫూర్తి నింపుతూ, “ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులుగా మీరు ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌కు వెళ్లడం చాలా ఆసక్తిగా, గర్వంగా ఉంది. సాధారణ వ్యక్తులలో లేని కృషి, పట్టుదల మీలో ఉన్నాయి. జీవితంలో మీరు ఎన్నో అవమానాలు, మాటలు ఎదుర్కొని ఉంటారు. వాటన్నింటినీ అధిగమించి ఈ స్థాయికి రావడం అభినందనీయం. మనలో ఉన్న కసి, పట్టుదలే మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి” అని అన్నారు. “మీలాంటి వారిని ప్రోత్సహిస్తే సమాజంలో కూడా గొప్ప మార్పు వస్తుంది. ఈ కార్యక్రమాన్ని నేను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తాను. మా కుటుంబంలో కూడా ఒకరు మాట తడబాటుతో ఇబ్బంది పడ్డారు. ఎంతోమంది ఎగతాళి చేశారు. దేవుడు ప్రతి కుటుంబానికి ఒక పరీక్ష పెడతాడు, దానిని జయించే శక్తిని కూడా ఇస్తాడు. ఆ శక్తి మీ అందరిలో ఉంది. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించండి. సమాజం మిమ్మల్ని గౌరవించేలా, సొంత పిల్లల్లా చూసుకునేలా మీరు ఎదగాలి” అని లోకేశ్ పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఇలాంటి ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. “ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గారు చెప్పినట్టు ‘అమ్మకు చెప్పలేని పని చేయవద్దు’ అనే మాటను జీవితాంతం గుర్తుంచుకోండి. నా జీవితంలో కూడా ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు ఎంతో సాయం చేశారు. అదేవిధంగా మీరు కూడా సమాజానికి తిరిగి సేవ చేయాలి. కనీసం 10 మందికి సాయపడాలి. మిమ్మల్ని చిన్నచూపు చూడాలంటే భయపడేలా మీ కృషితో, పట్టుదలతో సమాజానికి ఆదర్శంగా నిలవాలి” అని మంత్రి ఉద్బోధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్య, దివ్యాంగుల ప్రోత్సాహం, అభ్యసన ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులను అభినందించి, వారితో కలిసి గ్రూప్ ఫోటో దిగారు.

# ఇలా చేస్తే అమరావతికి తిరుగుండదు.. ప్రభుత్వానికి విజయసాయిరెడ్డి కీలక సూచనలు

అమరావతి: ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంపై మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజధానిపై కొత్త ప్రభుత్వం కసరత్తు చేస్తున్న వేళ, ఆయన సోషల్ మీడియా వేదికగా కొన్ని కీలక సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు. అప్పుల డబ్బుతో, గొప్ప భ్రమలతో రాజధానిని రాత్రికి రాత్రే నిర్మించలేరని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి చారిత్రక నగరాల నిర్మాణాన్ని గుర్తుచేశారు. 1537లో కెంపె గౌడ స్థాపించిన బెంగళూరు, 1591లో కులీ కుతుబ్ షా నిర్మించిన హైదరాబాద్, 1639లో బ్రిటిష్ వారి ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న చెన్నై మహానగరాలుగా మారడానికి వందల సంవత్సరాలు పట్టిందని విశ్లేషించారు. ఈ నగరాలను హడావిడిగా నిర్మించలేదని, అవి తరతరాలుగా సహజసిద్ధంగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణం విషయంలో కూడా ఇదే విధానం అవసరమని సాయిరెడ్డి సూచించారు. ముందుగా పరిపాలనకు అవసరమైన అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు భవనాలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులకు అవసరమైన నివాస గృహాలను నిర్మించాలని తెలిపారు. ఆ తర్వాత నిర్మాణాలను అక్కడితో ఆపివేసి, ప్రజలు, వ్యాపారాలు, కాలంతో పాటు అమరావతి సహజసిద్ధంగా ఎదిగేందుకు అవకాశం ఇవ్వాలని సలహా ఇచ్చారు. రాజధాని నగరం అప్పులతో కాకుండా బలంతో ఎదగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఆకర్షణీయమైన డిజైన్లు, భారీ మౌలిక సదుపాయాల పేరుతో విచ్చలవిడిగా ఖర్చు చేయడం దార్శనికత కాదని, అది ఆర్థిక దుబారాకు దారితీస్తుందని హెచ్చరించారు. ఈరోజు అనవసరంగా ఖర్చు చేసే ప్రతి రూపాయి, భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలపై పెను భారం మోపుతుందని అన్నారు. ఆదాయం రాని ప్రాజెక్టులకు రుణాలు తేవడం మంచిది కాదని, పరిపాలనకు ఆడంబరమైన నిర్మాణాలు కాకుండా కార్యాచరణ ముఖ్యమని స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఈ విషయంలో జాగ్రత్త వహించకపోతే, అమరావతి ఒక ఆదర్శ రాజధానిగా కాకుండా, ఒక భారీ దుబారా ప్రాంతంగా మిగిలిపోయే ప్రమాదం ఉందని విజయసాయిరెడ్డి హెచ్చరించారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



# అంబేద్కర్ మార్గమే దేశానికి శరణ్యం

## – మైనారిటీ కులాల ఐక్యవేదిక




విజయనగరం, మహిన్యూస్, ఏప్రిల్ 14: డాక్టర్.అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని విజయనగరం జిల్లాలో రింగురోడ్డు, ఇప్పిలి వీధి, ఏనుగురాయి కాలనీ సెంటర్, మరియు స్టేడియం కాలనీలో గల అంబేద్కర్ విగ్రహాలకి పూలమాలవేసి ఘనంగా జయంతి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నాయకులు చోడి ఆదినారాయణ, దిమిలి పైడిరాజు, ఇప్పిలి రామారావు, లాయర్ షాజహాన్, జంపాన చిన్న, బూర ఐశ్వర్య యాదవ్, చెలికి లక్షణరావు, టీ తిరుపతి నాయుడు యుడు ,మాట్లాడుతూ ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ సృష్టికర్త, భావి భారత మార్గదర్శి అయినా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు జరుపుకోవడం భారత ప్రజల అదృష్టంగా భావిస్తున్నాం అని అన్నారు. సమ సమాజ స్థాపనకు, అంటరానితనం నిర్మూలనకు, భారత పరిపాలన కొరకు తన మేధస్సుని గ్రంథ రూపంలో చెక్కి భారతదేశానికి ఒక అపురూపమైన భారత రాజ్యాంగమును అందించిన మహనీయుడు అని కొనియాడారు.



మానవహక్కుల కోసం, మహిళ హక్కుల కోసం, అనగారిన వర్గాల ప్రజల కోసం, వివక్షతకు గురైన మనుషుల కోసం,బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ ప్రజల కోసం అనేక ప్రణాళికలు తయారు చేసి రాజ్యాంగంలో రూపొందించడం జరిగిందని తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ ఒక నిమ్మన జాతి కులంలో పుట్టి వివక్షత గురై కుమిలిపోకుండా ఒక మహా వృక్షంలా ఎదిగి భారత రాజ్యాంగ పరిపాలనకు, భారతజాతి ప్రజలకు నీడనిచ్చిన మహనీయునిగా ఎదిగారని హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ కులాల ఐక్యవేదిక తరపున జయంతి శుభాకాంక్షలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కుందేటి పార్వతి, ఎస్ ఆదిలక్ష్మి, ఆర్ ఈశ్వరరావు, కోనాడ పైడిశెట్టి, కోనాడ సతీష్, కొవ్వూరి అప్పలరాజు, కొవ్వూరు జగదీష్, కోనాడ సురేష్, కొత్తపల్లి తౌడు, ఎస్ రవి, సిహెచ్ సల్మాన్ రాజు, ఎర్రం శెట్టి రమణ, ఎస్ తారకేశ్వరరావు పాల్గొన్నారు.




# మోరి గ్రామంలో ఘనంగా జరుపుకున్న డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా/ మోరి, మహి న్యూస్, ఏప్రిల్ 14 : సఖినేటిపల్లి మండలం,మోరి గ్రామంలో డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుక టీడీపీ సీనియర్ నాయకులు కదలి వెంకటరత్నం అధ్యర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పెద్దలు అంబేద్కర్ సేవలు స్మరించుకుంటూ ఆయన విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు.ఈ వేడుకలో టీడీపీ సీనియర్ నాయకులు , మాజీ తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కదలి వెంకటరత్నం మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్..బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని నిమ్మన కులములో పుట్టి అత్యంత పేదరికం అనుభవించి, వీధి దీపాలలో చదువుకొని రాజ్యాంగాన్ని రచించి మనకి అందించిన గొప్ప మేధావి అని కొనియాడారు. రాజ్యాంగంలోని అన్ని విషయాలని మనందరం తెలుసుకుని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు. తెలుగుదేశం పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు కదలి వెంకటరత్నంతో పాటు మాజీ చేనేత సొసైటీ అధ్యక్షులు చింతా వీరభద్రేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పంగం సుధాకర్, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చెల్లి బోయిన శ్రీను, మాజీ ఉప సర్పంచ్ బూశిం నాగ సుబ్రహ్మణ్యేశ్వర రావు, మాజీ పంచాయతీ సభ్యులు పప్పుల రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉంద్రాజు వరపు బాబురావు, గ్రామ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కొండా సత్యనారాయణ, బిజెపి నాయకులు సత్యనారాయణ, పార్టీ శ్రీను, అంతిరి శ్రీను. ములికి తాతారావు, దొండపాటి శ్రీరామమూర్తి, మేడిది మళ్లీ తదితర పెద్దలు పాల్గొన్నారు.



# ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత రాజ్యాంగాన్ని రచించిన ప్రపంచ మేధావి డా.బి.ఆర్. అంబేద్కర్

చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 14: ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత రాజ్యాంగాన్ని రచించిన ప్రపంచ మేధావి డా.బి.ఆర్. అంబేద్కర్ అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు మంగళవారం చిత్తూరు పట్టణంలోనే దర్గా సర్కిల్ వద్ద, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి భారతరత్న డా.బి.ఆర్.అంబేద్కర్ 136వ జయంతి మహోత్సవం సందర్భంగాడా బి.ఆర్.అంబేద్కర్ విగ్రహమునకు, పూలమాలలు వేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చూడ చైర్మన్ కటారి హేమలత, డీఆర్ఓ మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూఅంబేద్కర్ గారి ఆలోచనలు, మార్గదర్శకత్వం దేశానికి దిశానిర్దేశం చేస్తున్నాయని తెలిపారు.ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అంబేద్కర్ ప్రతిమ ఏర్పాటు చేయడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం ప్రజలకు న్యాయం చేయాలనే భావనను అధికారులు గుర్తుంచుకోవడమేనని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా పేదలు, వెనుకబడిన వర్గాలకు ఆర్థికంగా, సామాజికంగా న్యాయం అందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. జిల్లాలో సుమారు ఐదు లక్షల ఎస్సీ జనాభా ఉన్నదని, వారి అభివృద్ధికి ఇంకా విస్తృతంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. పరిపాలనా మరియు రాజకీయ స్థాయిల్లో ప్రతి రోజు వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామని వెల్లడించారు. యువత, ముఖ్యంగా ఎస్సీ యువత అంబేద్కర్ జీవితం, భారత రాజ్యాంగం గురించి తప్పనిసరిగా అధ్యయనం చేయాలని కలెక్టర్ సూచించారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించే గొప్ప పత్రిక అని, దానిని అర్థం చేసుకోవడం ద్వారా సమాజంలో అవగాహన పెరుగుతుందని అన్నారు. అలాగే ఎస్సీ నాయకులు గ్రామ స్థాయిలో ప్రజలకు చైతన్యం కల్పిస్తూ, వారి సమస్యలను మండల, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం అందరూ కలసి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, ప్రజలకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ర్యాలీ రోడ్డు మార్గం ద్వారా అంబేద్కర్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు.

# డా. బీ ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భం గా ఘనివాళులు అర్పించిన జనసేన

## పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త శ్రీ అతికారి కృష్ణ



రాజంపేట. మహిన్యూస్. ఏప్రిల్.:14 : రాజంపేట నియోజకవర్గం రాజంపేట మండలం బంగ్లాగెస్ట్ గెస్ట్ హౌస్ దగ్గర భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న శ్రీ డా. బీ ఆర్ అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలలో పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త శ్రీ అతికారి కృష్ణ డా. అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన నాయకుడు కాదు, సమస్త మానవాళి కోసం పోరాడిన విశ్వమానవుడు. కుల రహిత సమాజ నిర్మాణం, సామాజిక న్యాయ సాధనలో ఆయన చేసిన కృషి అపూర్వం. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని మనకు అందించి, ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన మహనీయుడు శ్రీ అంబేద్కర్ గారు. విద్య ద్వారానే నిజమైన అభ్యున్నతి సాధ్యమని ఆయన ఇచ్చిన సందేశం నేటికీ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తోంది. డా. అంబేద్కర్ గారి సిద్ధాంతాలను ఆచరణలో పెట్టుకుని, ఆయన చూపిన దారిలో నడుస్తూ సమానత్వం, సామాజిక న్యాయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో సిద్ధవటం టీడీపీ నాయకులు పుత్త రామచంద్రయ్య గారు,జనసేన పార్టీ నాయకులు కె. ఎస్. నరసింహ , కోరముట్ల హరి, కేదారనాథ్,ఏ.ఏం. సి చైర్మన్ శ్రీకాంత్, టీడీపీ నాయకుడు గూగిళ్ళ చంద్రమౌళి , జనసేన నాయకులు ఒంటిమిట్ట మల్లేశ్వర రెడ్డి అవ్వారు రవి తదితరులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# దళితులు అంటే ఎందుకు నీకు అంత చులకన బీటెక్ రవి

## దళితులకు బీటెక్ రవి, క్షమాపణ చెప్పాలి




పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 14: బీటెక్ రవి దళితులు అంటే నీకు ఎందుకు అంత చులకన అని,దళితులను అవమానించేలా వ్యాఖ్యానించడం చాలా బాధాకరమని, దళితుల కు వెంటనే బీటెక్ రవి క్షమాపణ చెప్పాలని, మునిసిపల్ మాజీ చైర్మన్ వల్లెపు వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకులు కోళ్ల భాస్కర్, వైసిపి నాయకులు కృష్ణ మూర్తి, మాజీ కో ఆప్షన్ సభ్యులు దాసరి చంద్రమౌళి, బీసీ నాయకులు కార్తీక్ , అంజి, రవి, కలందర్,లు అన్నారు. మంగళవారం వారు పగలగొట్టిన బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేసి జై భీమ్ అని నినాదాలు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూదళితులను కించపరిచేలా చిల్లర చేష్టలు అని వ్యాఖ్యలు చేసిన బీటెక్ రవి తక్షణమే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. 2015లో ఇక్కడ అంబేద్కర్ విగ్రహాన్ని వైయస్ కుటుంబీకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం అంబేద్కర్ వర్ధంతి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించ డం వైయస్ అవినాష్ రెడ్డి సహకారంతో అల్పాహా రం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుంద న్నారు. అంబేద్కర్ అందరివాడు అన్నారు. మీరు కూడా ఇక్కడ అల్పాహారం ఏర్పాటు చేయవచ్చు భోజనాలు ఏర్పాటు చేయవచ్చు అన్నారు. ఏరోజైనా నువ్వు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసావా అని వారు ప్రశ్నించారు. ముందు రోజు అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించి విగ్రహాన్ని ఏరోజైనా కడిగించావా అని వారన్నారు. దళితులు అందరూ కలసి అలంకారం చేస్తే వచ్చి పూలదండ లు వేయడం ఎవరైనా చేస్తారన్నారు.బీటెక్ రవి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం బహుషా మొదటి సారి కావడం వలన ఈ ఫ్లెక్సీలు, షామియానాలు కొత్తగా కనిపించి ఉండవచ్చు వారు అన్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు కచ్చితంగా విగ్రహానికి అలంకరణ, పూల మాలలు వేయడం అనవాయితీగా వస్తోంది అని తెలిపారు.అంబేద్కర్ జయంతి సందర్భంగా అల్పాహారం ఏర్పాటు చేసే కార్యక్రమం లో భాగంగానే షామియానా వేయడం జరిగింది అన్నారు.అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కు ఖర్చు మొత్తం భరించిన వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి, వైయస్ అవినాష్ రెడ్డి కి కృతజ్ఞతగా 135 వ అంబేద్కర్ జయంతి సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి, ఫోటోలు ఉన్న బ్యానర్లు వేయడం జరిగింది అన్నారు.మీ పార్టీ లోనే కాదు మా పార్టీ లో కూడా బీపీ వచ్చే వారు ఉంటారు. మాట్లాడే సమయం లో భాధ్యత గా హుందాగా వ్యవహరించాలి అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ జయంతి ఉత్సవాల కు ముందస్తుగా పోలీస్ ల అనుమతి కూడా తీసుకోవడం జరిగింది అని గుర్తు చేశారు. ఇన్ని ఏళ్లలో ఏ రోజే గాని పోలీస్ పర్మిషన్ తీసుకున్న రోజులే లేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు లోనే మాకు ఈ దౌర్భాగ్యం పట్టిందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం దగ్గరకు వచ్చి నివాళులు అర్పించకుండా రాజకీయాలు మాట్లాడటం నీ దిగజారుడు తనానికి నిదర్శనమ న్నారు. దళితులను కించపరిచేలా చిల్లర చేష్టలు అని వ్యాఖ్యలు చేసిన బీటెక్ రవి, దళితులుగా పుట్టాలని ఎవ్వరైనా కోరుకుంటారా అని వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు కు మంచి బుద్ధి ప్రసాదించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి ఆశయాలు ఆదర్శనీయం

## రాజంపేట నియోజవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి



రాజంపేట.మహిన్యూస్. ఏప్రిల్:14: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 135 వ జయంతి సందర్భంగా రాజంపేట పట్టణం ఆర్ఎంబి బంగ్లా యందు ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజంపేటనియోజకవర్గం ఇంచార్జ్ ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వశక్తి తో ఉన్నత విద్యను అభ్యసించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు అని ఆయన అన్నారు కులం మతం లింగంతో సంబంధం లేకుండా అన్ని రంగాలలోని ప్రజలు సమానమని ఎంత కృషి చేశారని ఆయన అన్నారు యువత అంబేద్కర్ గారిని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన అన్నారు అప్పటి



సమాజంలో అసమానతలను అధిగమించి ప్రపంచ మేధావిగా అంబేద్కర్ గారు ఎదిగారని అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యస్.సి సెల్ ప్రధాన కార్యదర్శి దండు గోపి, రాజంపేట మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్అధ్యక్షుడు రెడ్డయ్య, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మరియు ఎంపీటీసీ మధుబాబు, రాజంపేట పట్టణ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్అధ్యక్షుడు బొజ్జ పెంచలయ్య, ఎం జి పురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొట్టం శ్రీనివాసులు, రాజంపేట పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమబత్తిన శ్రీనివాసులు, అప్పారాజపేట సర్పంచ్., సర్పంచ్వై యస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి పెంచలయ్య, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోలా రమణారెడ్డి,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణారావుయాదవ్,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు భాస్కర్ రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి,



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు వడ్డెరమణ,వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మైనార్టీ సెల్అధ్యక్షుడు ఖాజజముద్దీన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేనివిశ్వనాథరెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు మిరియాల సురేఖ,అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు నవీన్, మైనార్టీ నాయకుడు మునాఫ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్రసురేంద్ర, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ బీసీ నాయకుడు శ్రీనివాసులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుబేర్, రాజంపేట మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచాయితీ విభాగం అధ్యక్షుడు కళ్యాణ్ కుమార్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజంపేట మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు శివకుమార్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారి 135 వ జయంతి సందర్భంగా ఘన నివాళులు

## ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి.







కడప. మహిన్యూస్. ఏప్రిల్:14: మంగళవారం కడప నగరంలోని శంకరాపురం బాలికల కళాశాల వసతి గృహం నందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక విప్లవ కర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 135 వ జయంతి సందర్భంగా అంబేద్కర్ గారికి పూలమాలవేసి నివాళులు అర్పించిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుజాల సుమంత్, వీరపోగు రవి. అనంతరం వారు మాట్లాడుతూ. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనేత డాక్టర్ అంబేద్కర్ గారి ఆలోచనలు నేటి యువతకు మార్గదర్శకం కావాలని అన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతలను గుర్తుంచుకోవాలని, అన్యాయం ఎక్కడ జరిగినా ఎదిరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ హాస్టల్‌లలో చదువుతున్న పేద, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, ఇంకా చాలా హాస్టల్‌లలో ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని విమర్శించారు. విద్యార్థుల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఎస్ఎఫ్ఐ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో బాలికల హాస్టల్ వార్డెన్స్ లీలావతి, పద్మజ, ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిలేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.




# రైల్వే కోడూరులో.ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 135వ జయంతి వేడుకలు

## మాజీ శాసనసభ్యుల కోరముట్ల శ్రీనివాసులు



రైల్వే కోడూరు:మహిన్యూస్. ఏప్రిల్.:14: రైల్వే కోడూరు: వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధికార ప్రతినిధిడ కోడూరు నియోజకవర్గ ఇన్చార్జ్డ మాజీ శాసనసభ్యుల కోరముట్ల శ్రీనివాసులు ఆదేశాల మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి 135వ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి కేక్ కటింగ్ చేసుకొని మిఠాయిలు పంచుకొని ఒకరికొకరు అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు తెలియజేసుకున్న వైఎస్ఆర్సిపి, కార్యకర్తలు మాజీ సర్పంచులు జడ్పిటిసిలు ఎంపీటీసీలు వార్డు మెంబర్లు నాయకులు దళిత సంఘాల నాయకులు, తదితరులు భారీగా పాల్గొన్నారు

# అంబేద్కర్ ఆశయాలను నీరుగారుస్తున్న కూటమి ప్రభుత్వం: సిపిఐ(ఎం) నేతల ధ్వజం

కూనవరం, ఏప్రిల్ 14: పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కూనవరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కుతోందని, మతాల మధ్య చిచ్చు పెడుతూ విభజన రాజకీయాలకు పాల్పడుతోందని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేశ్వరరావు విమర్శించారు. మంగళవారం మండలంలోని టేకులబోరు గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి మేకల నాగేశ్వరరావు, కూనవరం టౌన్ శాఖ సెక్రెటరీ కొండ ఈశ్వర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, దేశంలో సెక్యులర్ విలువలను కాపాడాల్సిన పాలకులు, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ అంబేద్కర్ నిర్మించిన రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. కుల, మతాల పేరుతో ప్రజలను విడదీసి పబ్బం గడుపుకుంటున్న కూటమి ప్రభుత్వం, సామాజిక సమానత్వం కోసం అంబేద్కర్ చేసిన పోరాటాలను అగౌరవపరుస్తోందని మండిపడ్డారు. దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ, సామాన్యుల హక్కులను కాలరాస్తున్న పాలకులకు వ్యతిరేకంగా అంబేద్కర్ స్ఫూర్తితో మరో ఉద్యమానికి సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాల సాధన కేవలం మాటలకే పరిమితం కాకుండా, ఆచరణలో చూపాలంటే రాజ్యాంగ వ్యతిరేక శక్తులను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు మండల కమిటీ సభ్యులు తాళ్లూరు శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ కామ్రేడ్స్ తెలగాని నాగరాజు, నోముల సత్యనారాయణ, గడ్డిపాటి షణ్ముఖరావు, దళిత నాయకుడు యడ్ల గణేష్,తాళ్లూరి హరి నాగ కృష్ణవంశీ, తదితరులు పాల్గొన్నారు

మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
బుధవారం - 15 - ఏప్రిల్ - 2026

## మహాబోధి పాఠశాలలో డా. బి.ఆర్. అంబేద్కర్ 139వ జయంతి వేడుకలు




హైదరాబాద్, మహీన్యూస్ ఏప్రిల్ 14: అల్వాల్‌లోని మహాబోధి పాఠశాలలో -డా. బి.ఆర్. అంబేద్కర్ 139వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొని మహానేతకు ఘన నివాళులు అర్పించారు. అంబేద్కర్ విద్యా నిధి ట్రస్ట్ ట్రస్టీలు డా. ఎం. సురేష్ బాబు మరియు డా. జె. సుధీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల ఇన్‌చార్జ్ శ్రీ జి. రాము, ప్రిన్సిపాల్ భావాని మరియు బోధన, బోధనేతర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో డా. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఆయనకు ఘనంగా నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డా. ఎం. సురేష్ బాబు, డా. అంబేద్కర్‌ను గొప్ప నాయకుడిగా అభివర్ణిస్తూ, ఆయన ఆలోచనలు ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమాన్ని ఇప్పటికీ ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. “గౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం జరిగిన పోరాటం ఒక్కరోజులో ఏర్పడింది కాదు; దశాబ్దాల పాటు సాగిన సామాజిక సంస్కరణలు, రాజకీయ చైతన్యం, భావజాల మార్పుల ద్వారా అభివృద్ధి చెందింది” అని తెలిపారు. డా. జె. సుధీర్ తన ప్రసంగంలో భారత రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించి, దానిని రూపుదిద్దడంలో డా. అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆలోచనలు సమాజాన్ని చైతన్యపరిచే శక్తిగా నిలిచాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు కూడా ప్రసంగించి, అంబేద్కర్ జీవితం, సిద్ధాంతాలు మరియు వాటి ప్రస్తుత ప్రాధాన్యతపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. చివరగా, అంబేద్కర్ ఆశయాలైన సమానత్వం, విద్య మరియు సామాజిక సౌహార్ద్రాన్ని పాటించేందుకు పాఠశాల కుటుంబం కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

## అయ్యప్ప స్వామి పుట్టినరోజు సందర్బంగా ప్రత్యేక పూజలు



తాళ్లరేవు, మహి న్యూస్, ఏప్రియల్ 14.: కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కాపుల పాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి వారి పుట్టినరోజు వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కిరణ్ శర్మ బ్రహ్మత్వంలో, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి పంచామృతాలతో పాటు సుగంధ ద్రవ్యాలు, పల్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల నాదం మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయం అంతా భక్తుల ‘స్వామి శరణం అయ్యప్ప’ నినాదాలతో మార్మోగి భక్తి పారవశ్యాన్ని సంతరించుకుంది. ఇటీవల ఆలయం పునర్నిర్మాణం పూర్తయ్యిన తర్వాత జరుపుకుంటున్న తొలి పుట్టినరోజు కావడంతో ఈ వేడుకలకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది. దీంతో కాపుల పాలెం గ్రామంతో పాటు కనకాలపేట మరియు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయం భక్తులతో కిక్కిరిసి, పండుగ వాతావరణాన్ని





తలపించింది. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. శ్రద్ధగా పాల్గొన్న ప్రతి భక్తుడికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే రాత్రి 8 గంటల నుండి భక్తి భావంతో భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భజనల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాపులపాలెం, కనకాలపేట,యానాం,గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరియు అయ్యప్ప స్వామి భక్తులు భారీగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కట్టుబడి ఉన్నాం

### మంత్రి అచ్చెన్నాయుడు



శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. అంబేద్కర్ కేవలం ఒక వ్యక్తి కాదని, అణగారిన వర్గాల తలరాతను మార్చిన మహాశక్తి అని కొనియాడారు. పేద దళిత కుటుంబం నుంచి వచ్చిన ఆయన, చదువుతోనే ఏదైనా సాధ్యమని నిరూపించారన్నారు. అందుకే ఎన్టీ రామారావు హయాంలో ఎస్సీ, బీసీ వర్గాల కోసం పెద్ద సంఖ్యలో రెసిడెన్షియల్ పాఠశాలలు స్థాపించి విద్యా విప్లవానికి నాంది పలికారని గుర్తు చేశారు. మహిళా హక్కుల కోసం అంబేద్కర్ ఆనాడే రాజ్యాంగంలో రక్షణలు కల్పించారని, దానికి కొనసాగింపుగా త్వరలోనే చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ఎన్డీఏ ప్రభుత్వం కొత్త అధ్యాయాన్ని సృష్టించబోతోందని తెలిపారు. జిల్లాలోని సంజీవయ్య పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామని, హాస్టల్ పాఠశాలల్లో మౌలిక వసతులు, స్వచ్ఛమైన మంచినీరు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

### చట్టాలు సక్రమంగా అమలు జరిగినప్పుడే సామాన్యులకు మేలు:

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం మనకు ఎన్ని గొప్ప హక్కులు కల్పించినా, వాటిని అధికారులు, పాలకులు చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడే ప్రజలకు పూర్తిస్థాయిలో మేలు జరుగుతుందని అంబేద్కర్ ఆనాడే చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా అనేక హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తోందని ఆయన వివరించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్ చైర్మన్‌గా ఉన్న కాలంలోనే అంబేద్కర్ కు ‘భారతరత్న’ దక్కిందని, ఆయన స్ఫూర్తితోనే మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్ దేనని అన్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరి రెడ్డి మాట్లాడుతూ.. విద్యతోనే ఆత్మాభిమానం, వ్యక్తి వికాసం సాధ్యమని, వివక్ష లేని సమాజాన్ని నిర్మించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తిని సమానంగా గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ కూర్మారావు, చౌదరి బాబ్జి, రమణ మాదిగ, బొడ్డేపల్లి నరసింహులు మాదారపు వెంకటేష్, దుర్గారావు, మన్మధ, కొవ్వాడ సుశీల, రాయి వేణు, గేదెల రమణమూర్తి, టైక్వాండో శ్రీను, పలువురు నేతలు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజ్యాంగంతోనే అన్ని వర్గాలకు సమన్యాయం:

### ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్



ఎచ్చెర్ల, మహి న్యూస్, ఏప్రిల్ 14: దేశంలోని అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు సమన్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారని ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంద్ర అమరేంద్ర కుమార్ అన్నారు. మంగళవారం క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, సామాజిక సంస్కర్తగా భారతీయుల గుండెల్లో అంబేద్కర్ చెరగని ముద్ర వేశారన్నారు. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు ఆయనేనని కొనియాడారు. 64 సబ్జెక్టుల్లో లోతైన జ్ఞానం, 8 భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన అంబేద్కర్, ఆధునిక భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ తదితరులు ప్రసంగిస్తూ.. మహిళలకు ఆస్తి హక్కు, సమాన అవకాశాల కల్పనలో అంబేద్కర్ కృషిని వివరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.ముకుందరావు, క్యాంపస్ ఇన్చార్జి వి.సాగర్, ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమానికి ప్రేరణ డా. బాబాసాహెబ్ భీం రావ్ అంబేద్కర్

### డా. ముచ్చుకోట . సురేష్ బాబు

హైదరాబాద్ మహీన్యూస్ ఏప్రిల్ 14: బి. ఆర్. అంబేద్కర్ చిరస్థాయి ప్రభావం ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమ దిశను ఇంకా ప్రభావితం చేస్తూనే ఉంది. గౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం సాగిన దీర్ఘకాల పోరాట చరిత్రను ఇది ప్రతిబింబిస్తుంది.ఈ ఉద్యమాన్ని చారిత్రాత్మకంగా పరిశీలిస్తే, దళితుల ఆత్మగౌరవ భావం ఒక్కసారిగా ఏర్పడినది కాదని, దశాబ్దాల పాటు సాగిన సామాజిక సంస్కరణలు, రాజకీయ చైతన్యం, సిద్ధాంత పరమైన మార్పుల ఫలితంగా అది అభివృద్ధి చెందిందని స్పష్టమవుతుంది. పూర్వ హైదరాబాద్ రాష్ట్రంలో ప్రారంభమైన ఈ చైతన్యానికి భాగ్యరెడ్డి వర్మ అరిగే రామస్వామి వంటి సంస్కర్తలు నేతృత్వం వహించారు. వారు పీడిత వర్గాలలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేశారు.ఈ నాయకులు ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్, సునీతి బాల సమాజం వంటి సంస్థలను స్థాపించి విద్య, మద్యనిషేధం, ఆత్మగౌరవం వంటి అంశాలపై దృష్టి సారించారు. కుల వివక్షకు వ్యతిరేకంగా విస్తృత ఉద్యమానికి వారు పునాది వేశారు. అయితే, దళిత ఉపవర్గాల మధ్య ఉన్న అంతర్గత విభేదాలు ఐక్యతకు సవాలుగా నిలిచాయి.ఈ ఉద్యమానికి కీలక మలుపు బి. ఆర్. అంబేద్కర్ ప్రభావంతో వచ్చింది. విద్య, సంఘటితం కావడం, రాజకీయ సాధికారతపై ఆయన ఇచ్చిన పిలుపు దళిత ఉద్యమాన్ని కొత్త దిశలో నడిపింది. కులవ్యవస్థపై ఆయన చేసిన విమర్శలు, రాజ్యాంగ హక్కులపై ఆయన ఇచ్చిన ప్రాధాన్యం కొత్త తరానికి చెందిన నాయకులను నిర్మాణాత్మక మార్పుల కోసం పోరాడేలా ప్రేరేపించాయి.స్వాతంత్ర్యం అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమం క్రమంగా రాజకీయ దిశగా మలుపు తిరిగి, ప్రతినిధిత్వం, విద్యలో అవకాశాలు, ఆర్థిక హక్కులు వంటి అంశాలను ముందుకు తెచ్చింది. అయితే, కారంచేడు చుండూరు నరమేధం వంటి ఘోర సంఘటనలు ఈ ఉద్యమానికి నిర్ణాయక మలుపుగా నిలిచాయి.“ఈ సంఘటనలు కుల ఆధారిత అణచివేత ఎంత లోతుగా వేరూరిందో బయటపెట్టి, రాష్ట్రవ్యాప్తంగా దళిత సమాజాన్ని ఒక్కటిగా కదిలించాయి” అని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. బొజ్జా



తారకం కత్తి పద్మారావు వంటి నాయకులు నిరసనలను సమీకరించడంలో, ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వంటి వేదికలను నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు.ఈ దశలో దళిత ఉద్యమం సిద్ధాంతపరంగా కూడా మార్పును అనుభవించింది. అంబేద్కర్ ఆలోచనలను మార్క్సిస్టు విశ్లేషణతో మేళవించేందుకు కార్యకర్తలు ప్రయత్నించారు. కులం మరియు వర్గం మధ్య సంబంధాన్ని అర్థం చేసుకునే దిశగా ఈ ప్రయత్నాలు దళిత మేధో సంప్రదాయాన్ని బలోపేతం చేశాయి.కారంచేడు సంఘటన నేపథ్యంలో దళిత, రాడికల్ మరియు ప్రోగ్రెసివ్ సంస్థల సమిష్టి కృషితో ఆల్ ఇండియా దళిత్ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ వైపు భారీ “చలో అసెంబ్లీ” ర్యాలీ నిర్వహించబడింది. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు ఐదు లక్షల మంది పాల్గొన్న ఈ ర్యాలీకి ప్రముఖ దళిత నాయకులు, మానవ హక్కుల కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సంఘటనపై ఉన్న తీవ్ర ఆగ్రహాన్ని ఇది ప్రతిబింబించింది.ఈ విస్తృత నిరసనల ప్రభావంతో, ఎన్ టి రామారావు నేతృత్వంలోని ప్రభుత్వం స్పందించాల్సి వచ్చింది. ఈ అంశంపై శాసనసభలో విస్తృత చర్చ జరిగింది. దళితులపై జరిగిన దాడులను ప్రభుత్వం అంగీకరించి, విచారణ కోసం న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేసింది.ఈ నిరసన తరంగం 1985 సెప్టెంబర్ 1న జరిగిన చారిత్రాత్మక “చలో చీరాల” సభతో కొనసాగింది. ఈ సభలో మూడు లక్షలకు పైగా దళితులు పాల్గొని, ఆవేదనతో కూడిన నినాదాలతో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వేదికను పూర్తిగా దళితులకు కేటాయించడం ఒక ముఖ్య విశేషం. ఇకపై తమ తరఫున ఇతరులు మాట్లాడాల్సిన అవసరం లేదని, తమ స్వరాన్ని తామే వినిపిస్తామని వారు స్పష్టం చేశారు.ఈ సభను ప్రజాయుద్ధ నౌక గద్దర్ ప్రారంభించడం ఉద్యమానికి సాంస్కృతిక శక్తిని జోడించింది. ఆయన రచించి పాడిన “దళిత పులలమ్మ...” పాట దళితుల ధైర్యాన్ని, భూస్వామ్య దౌర్జన్యాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని ప్రతిబింబించింది. తన గీతాల ద్వారా గద్దర్ అణగారిన వర్గాల స్వరంగా నిలిచి, ఉద్యమానికి ప్రేరణనిచ్చారు.1990 దశకంలో దళిత సమాజంలో అంతర్గత అసమానతలు స్పష్టమయ్యాయి. మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఎంఆర్పీఎస్ ఉద్యమం వెలుగులోకి వచ్చి, రిజర్వేషన్లలో ఉపవిభజన కోరింది. ఇది వేర్వేరు షెడ్యూల్డ్ కులాల మధ్య సమాన అవకాశాల అవసరాన్ని ముందుకు తెచ్చింది.దళిత మహిళలు కూడా ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తూ భూహక్కులు, సామాజిక న్యాయం, లింగ వివక్ష వంటి అంశాలను ముందుకు తెచ్చారు. వారి భాగస్వామ్యం ఉద్యమాన్ని మరింత సమగ్రంగా మార్చింది.ఇటీవలి దశాబ్దాల్లో ఈ ఉద్యమం అంతర్జాతీయ స్థాయికి విస్తరించి, కుల వివక్షను గ్లోబల్ మానవ హక్కుల సమస్యగా ప్రస్తావించింది. సమానత్వం, న్యాయం వంటి అంశాలపై ప్రపంచవ్యాప్త చర్చలతో దళిత పోరాటాన్ని అనుసంధానించింది.గణనీయమైన పురోగతి ఉన్నప్పటికీ, కుల హింస, ఆర్థిక అసమానతలు, అంతర్గత విభేదాలు వంటి సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయి. అయినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో దళిత ఉద్యమం ప్రజాస్వామ్య విలువలను బలపరుస్తున్న శక్తిగా నిలుస్తోంది.బి. ఆర్. అంబేద్కర్ ఆశయాలను ఆధారంగా చేసుకుని, సమానత్వం, గౌరవం, న్యాయం కలిగిన సమాజం కోసం ఈ ఉద్యమం తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది.

## ప్రపంచ ప్రాధాన్యంగా వృద్ధుల సంరక్షణ గౌరవం పెరగాలి

### డా. ముచ్చుకోట . సురేష్ బాబు

అనంతపురం మహి న్యూస్ ఏప్రిల్ 14.: వృద్ధాప్యము లేదా ముసలితనము మానవ జన్మలో చివరి దశ. దీనిని నిర్వచించడానికి వయోపరిమితి లేనప్పటికి, మనిషి శరీరము రోగనిరోధక శక్తిని క్రమక్రమముగా కోల్పోయి చివరకు మరణించే స్థితికి చేరే దశను వృద్ధాప్యముగా చెప్పవచ్చు. ఈ జీవిత భాగంలో జరిగే శారీరక మార్పులను, వ్యాధులను పరిశోధించే విభాగాన్ని జీరియాట్రిక్స్ అంటారు. వృద్ధాప్య దశలోకి ప్రవేశిస్తున్న ప్రపంచంలో, సమాజం తన వృద్ధులను ఎలా చూస్తోంది అన్న ప్రశ్న మరింత ప్రాముఖ్యత పొందుతోంది. ఈ చర్చకు కేంద్రంగా నిలిచే అంశం ఒక సులభమైన కానీ లోతైన సూత్రం గౌరవం. ఆరోగ్యం క్షీణించడం లేదా ఇతరులపై ఆధారపడాల్సి వచ్చే పరిస్థితుల్లో వృద్ధులకు గౌరవం అనేది ఒక సిద్ధాంతం మాత్రమే కాదు, వారి దైనందిన జీవితానికి అవసరమైన మూలాధారం. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, గౌరవప్రదమైన ప్రవర్తన, గుర్తింపు వంటి అంశాలు దీనిని నిర్మిస్తాయి.నార్డిక్ దేశాలైన నార్వే, ఫిన్లాండ్, స్వీడన్, డెన్మార్క్‌లలో జరిగిన పరిశోధనలను సమీక్షించిన తాజా అధ్యయనం వృద్ధులు గౌరవాన్ని ఎలా




అనుభవిస్తారో వెల్లడించింది. ఈ పరిశోధనలో ఒక ఆందోళనకర ధోరణి బయటపడింది సమాజానికి జీవితాంతం చేసిన సేవలున్నప్పటికీ, వృద్ధులు తమను గుర్తించకపోవడం, విలువ ఇవ్వకపోవడం, పక్కనపెట్టబడినట్లు .భావిస్తున్నారు. “అదృశ్యత అనే కప్పు”ఈ అధ్యయనంలో ఒక ముఖ్యమైన భావన “అదృశ్యత అనే కప్పు” అనే రూపకంతో వివరించబడింది. వృద్ధులు తమ అనారోగ్యాన్ని లేదా అవసరాలను తగ్గించి చూపుతూ, తమ స్వేచ్ఛ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలని ప్రయత్నిస్తారు. వారు ఇతరులకు భారంగా కనిపించకూడదనే భావనతో ఇలా చేస్తారు. అయితే, ఈ విధానం కొంతవరకు స్వాతంత్ర్యాన్ని కాపాడినప్పటికీ, వారి స్వరాన్ని నిశ్శబ్దం చేయడం, ఒంటరితనాన్ని పెంచడం వంటి ప్రతికూల




ప్రభావాలను కలిగిస్తుంది. ఆరోగ్య సేవలలో గానీ, సమాజంలో గానీ గుర్తింపు లేకపోవడం గౌరవానికి తీవ్రమైన ముప్పు అని పరిశోధకులు గుర్తించారు. తమను వ్యక్తులుగా చూడకుండా, వ్యక్తిత్వం, అనుభవాలు, మరియు సేవలను గుర్తించకపోవడం వల్ల చాలా మంది వృద్ధులు బాధపడుతున్నారు. గౌరవప్రద సంరక్షణ ఎలా ఉండాలివృద్ధుల గౌరవాన్ని కాపాడడంలో ఆరోగ్య సంరక్షణ నిపుణులు, ముఖ్యంగా నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తారు. గౌరవప్రద సంరక్షణ అంటే కేవలం వైద్య చికిత్సకే పరిమితం కాదు. వృద్ధులకు వారి దినచర్యలు, వైద్య నిర్ణయాలు, నివాస పరిస్థితులపై నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా వారి స్వాతంత్ర్యం మరియు ఆత్మగౌరవం నిలబెట్టాలి. ఇది గౌరవప్రదమైన సంభాషణను కూడా కలిగి ఉంటుంది. వృద్ధులతో మాట్లాడేటప్పుడు వారిని గౌరవంగా వినడం, మధ్యలో అడ్డుకోకుండా స్పందించడం అవసరం. వ్యక్తిగత సంరక్షణ సమయంలో వారి గోప్యతను కాపాడటం కూడా అత్యంత ముఖ్యం, ఎందుకంటే ఇది మానవత్వాన్ని కాపాడుతుంది.వృద్ధులను అర్థవంతమైన కార్యకలాపాల్లో పాల్గొనేటట్లు చేయడం, నిర్ణయ ప్రక్రియలో వారిని భాగస్వామ్యం చేయడం ద్వారా వారు విలువైనవారిగా భావిస్తారు. ప్రతి వ్యక్తి జీవిత కథ, వ్యక్తిత్వం, అభిరుచులను గుర్తించి, వ్యక్తిగతంగా సంరక్షణ అందించడం ద్వారా వారు కేవలం రోగులుగా కాకుండా వ్యక్తులుగా గౌరవింపబడతారు. వ్యవస్థాపక సవాళ్లుగౌరవంపై అవగాహన పెరుగుతున్నప్పటికీ, వృద్ధుల సంరక్షణలో ఇంకా అనేక సవాళ్లు ఉన్నాయి. వృద్ధులను చిన్న పిల్లలలా చూడడం లేదా వారి మాటలను పట్టించుకోకపోవడం వంటి “ఇన్ఫాంటిలైజేషన్” ఒక సాధారణ సమస్యగా ఉంది. శారీరక లేదా మానసిక క్షీణత వల్ల స్వాతంత్ర్యం కోల్పోవడం, వారు భారంగా మారుతున్నామనే భావనను కలిగిస్తుంది, ఇది మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీర్ఘకాల సంరక్షణ సంస్థల్లో వ్యక్తిగత సంబంధాల కంటే వ్యవస్థాపక సామర్థ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల వ్యక్తిత్వం కోల్పోయే ప్రమాదం ఉంది. పరిశోధనలు చూపించిన మరో అంశం సంరక్షకులు మరియు వృద్ధుల మధ్య దృష్టికోణ భేదం. ఆరోగ్య నిపుణులు వ్యవస్థ, పని విధానాలపై దృష్టి పెట్టగా, వృద్ధులు విశ్వాసం, భావోద్వేగ సంబంధం, సామాజిక భాగస్వామ్యం వంటి అంశాలను ఎక్కువగా విలువగా భావిస్తారు.

### నార్డిక్ దేశాలలో విధాన చర్యలు

వృద్ధుల గౌరవాన్ని పరిరక్షించడానికి నార్డిక్ దేశాలు చట్టపరమైన చర్యలు తీసుకున్నాయి. నార్వేలో 2011లో అమలులోకి వచ్చిన “డిగ్నిటీ గ్యారంటీ” వృద్ధులకు గౌరవప్రదమైన వ్యక్తిగత సంరక్షణను నిర్ధారిస్తుంది. ఫిన్లాండ్‌లో 2013లో అమలులోకి వచ్చిన చట్టం వృద్ధులు సురక్షితంగా, అర్థవంతంగా జీవించేందుకు దోహదపడుతుంది. డెన్మార్క్ జీవన నాణ్యత, స్వాతంత్ర్యం, పోషణ, మరియు గౌరవప్రదమైన మరణంపై దృష్టి పెడుతుంది. స్వీడన్‌లో సామాజిక సేవల చట్టంలో చేసిన మార్పులు వృద్ధుల సంక్షేమం, భాగస్వామ్యం, గోప్యత గౌరవాన్ని ప్రధానంగా ఉంచాయి. ఈ చర్యలు ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించే భాగస్వామ్యం, సమానత్వం, స్వాతంత్ర్యం, మరియు ఆరోగ్య హక్కు వంటి సూత్రాలతో అనుసంధానంగా ఉన్నాయి.

### మానవ హక్కుల దృక్కోణం

గౌరవం అనేది మానవ హక్కులలో ఒకటి మాత్రమే కాదు, అది సామాజిక సంబంధాల ద్వారా అనుభవించబడే జీవన అనుభవం కూడా. దయ, గౌరవం, మరియు చేర్చుకునే భావన ద్వారా ఇది నిలబెట్టబడుతుంది. నిర్లక్ష్యం, నిరాదరణ, అవమానకర ప్రవర్తన ద్వారా ఇది దెబ్బతింటుంది. గౌరవం అనేది సంబంధాలపై ఆధారపడినది. కుటుంబ సభ్యులు, సంరక్షకులు, ఆరోగ్య నిపుణులతో సానుకూల సంబంధాలు వ్యక్తి ఆత్మగౌరవాన్ని పెంచుతాయి. కానీ నిర్లక్ష్యం లేదా కేవలం పని మీద ఆధారపడిన సంరక్షణ అవమానాన్ని, అనిశ్చితిని, భావోద్వేగ బాధను కలిగిస్తుంది.

### వృద్ధుల స్వరానికి ప్రాధాన్యం

భవిష్యత్ పరిశోధనలు మరియు విధానాలు వృద్ధుల స్వరాన్ని కేంద్రంగా తీసుకోవాలి అని నిపుణులు సూచిస్తున్నారు. వారి అనుభవాలను అర్థం చేసుకోవడం ద్వారానే నిజమైన గౌరవాన్ని కలిగించే సంరక్షణ వ్యవస్థలను నిర్మించవచ్చు.ప్రపంచవ్యాప్తంగా జనాభా వృద్ధాప్య దశలోకి వెళ్తున్న నేపథ్యంలో, వృద్ధుల గౌరవాన్ని కాపాడటం ఇక ఐచ్ఛికం కాదు అది సమాజపు బాధ్యత. జీవన కాలాన్ని పెంచడమే కాదు, ఆ సంవత్సరాలు గౌరవంతో, అర్థవంతంగా, మానవీయంగా గడవాలన్నది అసలు సవాలు.

## ప్రజాస్వామ్యం లో ఓటమి... న్యాయస్థానం లో గెలుపు

**2021 పంచాయతీ ఎన్నికల లో ఓటమి**

**2026 న్యాయ స్థానం లో గెలుపు**

**గెలిచినా ఫలితం లేని సర్పంచ్**

**2021గ్రామపంచాయతీ ఎన్నికలలో 10 ఓట్లు తేడా తొ ఓటమి ప్రకటన చేసిన అధికారులు**

**ఓట్ల లెక్కింపు అధికారులు సిబ్బంది నిర్వాకంతో చేజారిన పదవి**

ముమ్మిడివరం(మహి న్యూస్ ) ఏప్రిల్ 14: 2021 పంచాయతీ ఎన్నికలలో ఓటమి చెందిన వ్యక్తి నేడు పంచాయతీ విన్నర్ గా విజయకేతనం ఎగరవేసిన సంఘటన ముమ్మిడివరం మండలం గాడిలంక గ్రామం లో జరిగింది. వివరాలకి సంబందించి ఎన్నికల ఓట్ల లెక్కంపు అధికారుల, సిబ్బంది నిర్వాకం కారణం గా సర్పంచ్ గా పోటీ చేసిన వ్యక్తి..నాడు ఓట్ల లెక్కింపులో ఓటమి పాలై ...నేడు కోర్టు తీర్పుతో విజయం సాధించాడు.అయితే పదవీకాలం పూర్తి కావడంతో అతని గెలుపు శూన్యంగా మిగిలిందనడం లో ఎంత మాత్రం అతిశయం లేదు .. 2001లో జరిగిన పంచాయితీ ఎన్నికల్లో ముమ్మిడివరం మండలం గాడి లంకలో సర్పంచి పదవికి తెలుగుదేశం పార్టీ తరఫున పెద్దిరెడ్డి వెంకట కృష్ణారావు, వైసీపీ పార్టీ తరఫున పెద్దిరెడ్డి నాగ మునీంద్ర రావులు పోటీపడ్డారు. అయితే ఎన్నికల ఓట్ల లెక్కింపులో పెద్దిరెడ్డి నాగ మునేంద్రరావు 10 ఓట్ల మెజారిటీతో విజయం సాధించాడు. నాగ మునేంద్రరావుకి 472 ఓట్లు రాగా పెద్దిరెడ్డి వెంకట కృష్ణారావుకు 462 ఓట్లు లభించాయి. చెల్లనవి 19,నోటా కు 29 ఓట్లు పడ్డాయి.అయితే ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని, ఓట్ల లెక్కింపు అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారని.. వెంకట కృష్ణారావు ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, జ్యూడిషన్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ని ఆశ్రయించాడు . వాదోపవాదాలు అనంతరం... ఓట్లు లెక్కింపునకు ఎంపీడీవో కార్యాలయంలో భద్రపరిచిన బ్యాలెట్ బాక్స్ లను కోర్టు కమిషన్ కు అప్పగించాలని కోర్టు ఆదేశించడంతో వాటిని ఎంపీడీవో



కార్యాలయం వారు కోర్టుకు అప్పగించారు. దీంతో జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహమతుల్లా సమక్షంలో ఓట్లు లెక్కింపు జరపగా వెంకటకృష్ణారావుకు 462 ఓట్లు లభించగా, పెద్దిరెడ్డి నాగ మునేంద్రరావుకు గతంలో లభించిన 472 ఓట్లలో 24 ఓట్లు చెల్లనివిగా గుర్తించి వాటిని తొలగించడంతో 448 ఓట్లు మిగిలాయి.దీంతో 14 ఓట్లు మెజారిటీతో వెంకట కృష్ణారావు విజయం సాధించినట్లు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహమతుల్లా తీర్పునిచ్చినట్లు వెంకట కృష్ణారావు న్యాయవాది రెడ్డి సత్యనారాయణ తెలిపారు. అయితే సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో వెంకటకృష్ణారావు విజయం నిరుపయోగంగా మిగిలింది. కాగా 3వ వార్డు స్థానానికి పోటీ చేసిన పాము వెంకటేశ్వరరావు ఒక ఓటు తేడాలో ఓటమి పాలయ్యాడు. ఆ వార్డు స్థానానికి వైసీపీ తరఫునపోటీచేసిన పాము నాగలక్ష్మి కి 58 ఓట్లు లభించగా టిడిపి తరఫున పోటీచేసిన పాము వెంకటేశ్వరరావుకు 57 ఓట్లు లభించాయి.దీంతో వెంకటేశ్వరరావు కూడా కోర్ట్ ను ఆశ్రయించగా అతని ఓట్లు కూడా కోర్టు లో లెక్కింపు జరిగింది. కోర్టులో నిర్వహించిన ఓట్ల లెక్కింపులో పాము నాగలక్ష్మి కి 58 ఓట్లు..పాము వెంకటేశ్వరరావు కు 57 ఓట్లు ఉండటంతో పాము నాగ లక్ష్మి విజయం లొ మార్పు లేదని నిర్ధారణ చేసారు.

### నాకు న్యాయం చెయ్యాలి :

### వెంకట కృష్ణారావు మాట్లాడుతూ

ఓట్ల లెక్కింపులో అప్పటి అధికార వైసిపి పార్టీ అండదండలతో అక్రమాలు జరిగాయని, తాను రీకౌంటింగ్ కోరినా కౌంటింగ్ అధికారులు అంగీకరించకుండా ఏకపక్షంగా వ్యవహరించారని. నాడు జరిగిన అన్యాయం నేడు న్యాయస్థానం ద్వారా వెలుగులోకి వచ్చిందని,అప్పటి ఓట్ల లెక్కింపు అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని పెద్దిరెడ్డి వెంకటకృష్ణారావు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్

## వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ భరత్ గుప్తా

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 14:- ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని, వారి స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ భరత్ గుప్తా పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక పాత బస్టాండ్ లో భారతరత్న డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని డా.బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్ లు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్ లు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి, అక్కడే ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డా.బి.ఆర్. అంబేద్కర్ అందించిన శక్తివంతమైన రాజ్యాంగం వల్లే దేశం అత్యున్నత స్థాయిలో, ఎలాంటి సమస్యలు లేకుండా ఉన్నామన్నారు. రాజ్యాంగానికి గౌరవం ఇవ్వడంలో, సమాన హక్కులు ఇవ్వడంలో, చట్టం ముందు అందరూ సమానమే అనే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యతను ఇస్తుందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆ కాలంలోనే కొలంబియా యూనివర్సిటీ మరియు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి పెద్ద విశ్వవిద్యాలయాల్లో చదివి వచ్చారన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరుగని పోరాటం చేశారన్నారు.. అందరికీ సమాన హక్కులు, రాజ్యాంగ ఫలాలు దక్కాలని కృషి చేశారన్నారు. ఆయన పాటించిన సిద్ధాంతాలను మనం అనుసరించాలని, అప్పుడే మనకు గుర్తింపు, ప్రజల్లో సానుకూలత ఉంటుందన్నారు. అభివృద్ధి విషయానికి వస్తే కర్నూలులోని ఓర్వకల్లులో పరిశ్రమల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, దీనివల్ల చదువుకున్న యువతకు భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈరోజు మేము మౌర్య ఇన్ లోని పర్నియా ఫంక్షన్ హాల్‌లో జాబ్ మేళా ఏర్పాటు చేశామన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 6 గంటల వరకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఈ పవిత్రమైన రోజున ఉద్యోగాలు పొందితే అది వారి జీవితంలో ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం కృషి చేస్తోందన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఒక సామాన్య రైతు కుటుంబం నుండి వచ్చి ఈ రోజు ఒక ఎంపీ హోదాలో ఈ స్టేజీ మీద కూర్చుని మాట్లాడుతున్నానంటే, అది కేవలం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగం యొక్క గొప్పతనమే అన్నారు. ఆనాడు సమాజంలో ఉన్న కుల వివక్ష, అంటరానితనం వంటి అనేక అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. ప్రతి మనిషి పుట్టుకతో పేదవాడు కాదని, పుట్టిన తర్వాత సమాజంలో ప్రతి ఒక్కరూ సమానంగా ఉండాలనే సంకల్పంతో ఆయన రాజ్యాంగాన్ని రచించారన్నారు. ప్రపంచ దేశాలన్నింటినీ చుట్టి, ఒక టీమ్‌గా ఏర్పడి, దానికి ఆయన అధ్యక్షత వహించి, ప్రపంచంలో మరే దేశానికి లేని విధంగా అత్యుత్తమ రాజ్యాంగాన్ని రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన కృషి ఫలితంగానే, ఈ రోజు మనలాంటి సామాన్యులు కూడా చట్టసభల్లో, రాజ్యాధికారంలో భాగస్వాములవుతున్నామన్నారు. మనం ఈ రోజు లోక్‌సభలో అడుగు పెట్టామంటే అది కేవలం అంబేద్కర్ చొరవ వల్లనే అని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారు ఆ రోజు రాజ్యాంగాన్ని రచించిన తర్వాత, బీసీలకు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు మరియు ప్రతి ఒక్క వర్గం వారికి న్యాయం జరిగే విధంగా ఆయన ప్రతి అంశాన్ని అందులో పొందుపరిచారన్నారు. అంబేద్కర్ ఆశయాలను పాటించడంలో రాష్ట్ర ప్రభుత్వం అగ్రస్థానంలో ఉందన్నారు. రేపు లేదా ఎల్లుండి, లోక్‌సభలోకి మహిళా బిల్లు రాబోతోందన్నారు. 33% రిజర్వేషన్లతో లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెడుతున్నారని, ఇది మనందరికీ గర్వకారణం అన్నారు. రాజ్యాంగ సవరణల ద్వారా మన భవిష్యత్తును నిర్ణయించుకునే దిశగా, రాజ్యాంగ పీఠిక మీద మనం నడుస్తున్నాం అన్నారు. కాబట్టి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల మేరకు మనమందరం నవసమాజ స్థాపనలో భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నాను అన్నారు. కుల వివక్షను పారద్రోలి, బీసీలకు పెద్దపీట వేశారు కాబట్టి, మనమందరం అంబేద్కర్ గారి గొప్పతనాన్ని చాటిచెబుతూ, రాజకీయ చైతన్యం దిశగా అడుగులు వేయాలని కోరుకుంటున్నాను అన్నారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం కోసం డా. బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషి అపారమన్నారు. అంబేద్కర్ జన్మించిన కాలంలో తీవ్రమైన అంటరానితనం, కుల వివక్షత నెలకొని ఉండేదన్నారు. ఆ కాలంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలు అగ్రకులాల వారిని తాకినా వారు వెళ్లి స్నానం చేసే పరిస్థితులు ఉండేవని, తాగునీరు కూడా అందుబాటులో లేకుండా తీవ్ర అన్యాయం జరిగేదన్నారు. గ్రామాల్లోని బావుల్లో నీరు తాగడానికి కూడా అనుమతి లేకపోయేదని, అలాంటి ప్రయత్నం చేసిన వారిపై తీవ్రమైన శిక్షలు విధించబడేవని గుర్తు చేశారు. అలాగే కర్ణాటక, కేరళ వంటి ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ మహిళలు పై వస్త్రం ధరించకూడదనే అమానుష నియమాలు అమల్లో ఉండేవని, ఆ కాలం ఎంత దారుణంగా ఉండేదో జాయింట్ కలెక్టర్ వివరించారు. అంబేద్కర్ ఎంతో ప్రతిభావంతుడైన విద్యార్థి అయినప్పటికీ, ఆయనను తరగతి గది బయట కూర్చోబెట్టి చదివించేవారన్నారు. ఈ విధమైన అన్యాయ పరిస్థితుల మధ్య కూడా అంబేద్కర్ విద్యను ఆయుధంగా తీసుకుని ముందుకు సాగి, భారత రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారన్నారు. దేశానికి సమానత్వం, హక్కులు, న్యాయం కల్పించే గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడని కొనియాడారు. అదే విధంగా, భారత రిజర్వ్ బ్యాంక్ స్థాపనలో కూడా ఆయన ఆలోచనలు, సూచనలు ముఖ్య పాత్ర పోషించాయన్నారు. కార్మికుల సంక్షేమం కోసం రోజుకు 12 గంటల పని విధానాన్ని 8 గంటలకు పరిమితం చేయడంలో, మహిళలకు ప్రసూతి సెలవులు కల్పించడంలో, కార్మిక హక్కులను రక్షించడంలో అంబేద్కర్ కృషి విశేషమన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలోనే పాకిస్తాన్, శ్రీలంక, మయన్మార్ వంటి దేశాలు కూడా స్వాతంత్ర్యం పొందాయని గుర్తు చేశారు. అయితే ఆ దేశాల్లో సైనిక పాలన ఏర్పడగా, భారతదేశంలో మాత్రం రాజ్యాంగ పరిపాలన కొనసాగుతున్నదంటే, దానికి ప్రధాన కారణం అంబేద్కర్ రచించిన బలమైన రాజ్యాంగమేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించి, సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ మాట్లాడుతూ మహా మేధావి అయిన అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ చదువుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంటరానితనం, నిరక్షరాస్యతను రూపమాపడానికి, సమాజంలోని నిరాశ నిస్పృహలను తొలగించడానికి ఈ మహానుభావులు జన్మించారన్నారు. అంబేద్కర్ గారు రూపొందించిన రాజ్యాంగం వల్ల ఈరోజు ఎస్సీ, ఎస్టీ మరియు మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా మరియు రాజకీయంగా అనేక అవకాశాలు లభించాయని, దీనివల్ల మనం ఒక మెట్టు పైకి ఎదగగలిగామని తెలిపారు. అంబేద్కర్ బాల్యం, చదువు మరియు ఆయన పోరాట పటిమ మనందరికీ స్పష్టంగా అర్థమవుతుందని, వారి జీవితాల నుండి స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ చదువుకొని సమాజంలో గౌరవం, గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు చదువుకుంటే ఆ ఇంటికి, ఆ కుటుంబానికి వెలుగు వస్తుందన్నారు. కర్నూలు జిల్లాలో ఉన్నటువంటి 57% అక్షరాస్యతను, నెక్స్ట్ ఐదు సంవత్సరాలకల్లా కనీసం 70 నుంచి 80% అక్షరాస్యతను తీసుకువద్దాం అన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటో, ప్రశంస పత్రాలను అందచేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి రాధిక, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఎ.పి.ఈ.డబ్ల్యు.ఐ.డి.సి డైరెక్టర్ జి. నాగమణి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు, బొందిల్ల కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్ సింగ్, మాజీ మంత్రి మారెప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ బంగి అనంతయ్య, వివిధ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ లు, డి వి ఎం సి సభ్యులు మాలతి, సురేంద్ర, మధు నాయక్, ఎస్సీ కుల సంఘాల నాయకులు సోమ సుందరం, అనంతరత్నం మాదిగ, రెడ్డిపోగు రాజ్ కుమార్, కాసరపు వెంకటేశ్వర్లు, డిఈ నాగరాజు, ఎస్టీ కుల సంఘాల నాయకులు కైలాష్ నాయక్, చంద్రప్ప, యోగేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## జనగణన 2027లో స్వీయ నమోదు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 14 :- జనగణన 2027లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెల్ఫ్-ఎన్యూమరేషన్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. ఇందుకు ప్రత్యేకంగా రూపొందించిన అధికారిక వెబ్‌సైట్ https://se.census.gov.in? ద్వారా సులభంగా నమోదు చేసుకోవచ్చన్నారు. ముందుగా పోర్టల్‌లో నమోదు చేసుకుని, మొబైల్ నంబర్ ద్వారా ఓటీపీ ధృవీకరణ పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కుటుంబ సభ్యుల వివరాలు, నివాస సమాచారం, విద్య, ఉపాధి వంటి అంశాలను సరిగా నమోదు చేయాలన్నారు. ఒక కుటుంబానికి ఒక మొబైల్ నంబర్ మాత్రమే ఉపయోగించాలని సూచించారు. నమోదు పూర్తయిన తరువాత "ప్రివ్యూ" ఆప్షన్ ద్వారా వివరాలను ఒకసారి పరిశీలించి, "ఫైనల్ సబ్మిట్" చేయాలని తెలిపారు. నమోదు పూర్తైన వెంటనే 11 అంకెల ప్రత్యేక ఎస్ఈ ఐడి జనరేట్ అవుతుందని, దానిని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే, ఇంటర్నెట్ సౌకర్యం లేని వారు లేదా నమోదు చేయడంలో ఇబ్బందులు ఎదురైతే, ప్రభుత్వ నియమించిన ఎన్యూమరేటర్లు ఇంటింటికి వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. జిల్లాలోని ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుని జనగణన ప్రక్రియలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జనగణన ద్వారా ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలుకు అవసరమైన ఖచ్చితమైన డేటా లభిస్తుందని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన అత్యవసరం

### అప్రమత్తతతోనే ప్రాణ-ఆస్తి నష్టం నివారణ



నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 14 :- అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణం టెక్కె మార్కెట్ యార్డ్‌లోని అగ్నిమాపక శాఖ కార్యాలయ ఆవరణలో ఏప్రిల్ 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొని అగ్నిమాపక దళ సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శంకర్ ప్రసాద్, సహాయ ఫైర్ అధికారి రఘునాథ్, రామకృష్ణ డిగ్రీ కాలేజ్ ఎన్సిసి అండ్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, నివారణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.




ప్రమాదాల నివారణ దృష్ట్యా అగ్నిమాపక భద్రతా నిబంధనలు పాటించడం తో పాటు, పరికరాల సరైన వినియోగంపై శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాల్లో మాక్ డ్రిల్స్ మరియు అవగాహన ర్యాలీలను నిర్వహించడం ద్వారా ప్రజల్లో అప్రమత్తత పెంపొందించాలన్నారు. "అగ్ని ప్రమాదాలను ముందుగానే నివారించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించవచ్చు" అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మంత్రి పిలుపునిచ్చారు. ముఖ్యంగా నగరాల్లో నిర్మాణమవుతున్న భారీ భవనాలకు అగ్నిమాపక శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, భవనం చుట్టూ ఫైర్ ఇంజన్ సులభంగా తిరిగేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అత్యవసర నిష్క్రమణ మార్గాలు (ఎమర్జెన్సీ ఎగ్జిట్లు) ఏర్పాటు చేయడం కూడా తప్పనిసరి అన్నారు. అదేవిధంగా టపాకాయల గోదాములు నిర్వహించే వారు చట్టబద్ధమైన లైసెన్సులు కలిగి ఉన్నారా అనే అంశాన్ని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలైన బండి ఆత్మకూరు, మహానంది, శ్రీశైలం ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక సేవల విభాగం ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "సురక్షిత పాఠశాలలు - సురక్షిత ఆసుపత్రులు - అగ్ని ప్రమాదాలపై అప్రమత్తమైన సమాజం" అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇంట్లో విద్యుత్ వైర్లింగ్, గ్యాస్ స్టవ్ వినియోగం, సిలిండర్ నిర్వహణ వంటి అంశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, పిల్లలను అగ్గిపెట్టెలు, బాణసంచా వంటి ప్రమాదకర వస్తువుల నుంచి దూరంగా ఉంచాలని సూచించారు. ఇటీవల ఏసీలు, ఫ్రిజ్‌లు పేలిపోవడం వంటి ఘటనలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ పరికరాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు. సిలిండర్ వినియోగం అనంతరం రెగ్యులేటర్‌ను తప్పనిసరిగా ఆపడం, పరికరాలను సమయానికి సర్వీస్ చేయించడం వంటి సాధారణ జాగ్రత్తలు ప్రాణాలను రక్షించగలవని తెలిపారు. గతంలో నంద్యాల రూరల్ ప్రాంతంలో గ్యాస్ సిలిండర్ పేలి జరిగిన ప్రాణనష్టాన్ని ఉదాహరణగా ప్రస్తావిస్తూ అప్రమత్తత ఎంత ముఖ్యమో వివరించారు. జిల్లాలోని పరిశ్రమల్లో ఫైర్ సేఫ్టీ చర్యలపై ప్రతినెల సమీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రతి సంస్థ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఆధునిక సాంకేతిక వ్యవస్థల ద్వారా ఉరుములు, పిడుగులు వంటి విపత్తులపై ముందస్తు హెచ్చరికలు అందిస్తున్నదని తెలిపారు. ఈ సమాచారంతో ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది సేవలను కొనియాడుతూ, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సిబ్బందికి నివాళులు అర్పించారు. వారి కుటుంబాలకు జిల్లా యంత్రాంగం తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి ధైర్యం చేకూరాలని ఆకాంక్షించారు. అంతకుముందు అగ్ని బాపక శాఖ సేఫ్టీ పరికరాలను మంత్రి, కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## ఆధునిక వైద్య సేవలు అందిచడం మా ప్రభుత్వం ధ్యేయం



కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 14:- ఆధునిక వైద్య సేవలు అందించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పరిశ్రమలు వాణిజ్యం మరియు ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ గుప్తా వీడిఆర్ఎల్ ల్యాబ్ భవనం ప్రారంభం సందర్భంగా పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కర్నూలు మెడికల్ కాలేజీలో అత్యాధునిక సదుపాయాలతో రూ 66 లక్షలు ఖర్చుతో నిర్మించిన వి.ఆర్.డి.ఎల్ ల్యాబ్ భవనం ను మంత్రి టి జి భరత్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ల్యాబ్ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతున్నది ఎన్డీయే ప్రభుత్వంతోనేనని పేర్కొన్నారు. కర్నూలు ప్రభుత్వాసుపత్రి ఇప్పటికే రోగులకు అందిస్తున్న మంచి సేవల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకుందని సిబ్బంది ని అభినందించారు. ఆస్పత్రి అభివృద్ధి కోసం మరిన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఆస్పత్రిలో సి ఎస్ ఆర్ నిధులు వెచ్చించి ముఖ్యంగా రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు వెంటిలేటర్లు, అల్ట్రాసౌండ్ యంత్రాల ఏర్పాటు చేయనున్నట్లు, ప్రమాదకర స్థితిలో ఉన్న 21 భవనాల స్లాబ్‌లను బలపరచే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మెడికల్ కాలేజీలో 70 సెంట్ల స్థలం లో విదేశాల్లో ఉన్న డాక్టర్ ల నిధులు రూ 50 కోట్ల వ్యయంతో ఆధునిక నాలెడ్జ్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. విద్యార్థులకు ఉన్నత స్థాయి విద్యా వసతులు కల్పించడం ద్వారా వైద్య రంగంలో నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. కర్నూలు సూపర్ సిక్స్ లో భాగంగా ఒకటి అయిన ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కోసం తాను అహర్నిశలు కృషి చేస్తున్నానని మంత్రి భరత్ గుప్తా స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

### కర్నూలు ఆసుపత్రిని రాష్ట్రంలో అత్యుత్తమ వైద్య కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యం

### కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఈ సందర్భంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ... కర్నూలు జనరల్ ఆసుపత్రి రాష్ట్రంలోనే అత్యధిక ఓపీ సేవలు అందిస్తున్న ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రిగా గుర్తింపు పొందిందన్నారు. రోజు వారీగా వేలాది మంది రోగులు ఈ ఆసుపత్రిని ఆశ్రయించడం ద్వారా ఇక్కడి వైద్య సేవల ప్రాముఖ్యత స్పష్టమవుతుందని తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఇటీవల ఎంపీతో జరిగిన చర్చలో, కర్నూలు ఆసుపత్రి రాష్ట్రంలోనే అత్యధిక రోగులు వచ్చే ప్రధాన ఆసుపత్రిగా అభివర్ణించారని, ఇక్కడి వైద్యులు మరియు సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని ప్రశంసించారని పేర్కొన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం కేంద్ర నిధులను సమర్థవంతంగా వినియోగిస్తూ, మంత్రి సహకారంతో భూమి పూజ చేసిన ఆరు నెలలలోనే వి.ఆర్.డి.ఎల్ ల్యాబ్ నిర్మాణాన్ని పూర్తి చేయడం సంతోషకరమని తెలిపారు. ఇది వైద్య సేవల నాణ్యతను మరింత పెంచుతుందని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఆసుపత్రి అభివృద్ధి పనులు నిర్లక్ష్యం పాలయ్యాయని, ప్రారంభించిన పనులు నిర్ణీత గడువులో పూర్తికాలేదని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంత్రి టి.జీ భరత్ గుప్తా నాయకత్వంలో మరియు ఎంపీగా తాను పలుమార్లు ఆసుపత్రిని సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కరించడానికి కృషి చేశామని తెలిపారు. సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా రూ.1.50 కోట్లతో వెంటిలేటర్ సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. అలాగే నర్సింగ్ కళాశాల విద్యార్థుల కోసం ఎం పి నిధుల తో ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందించడం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. కేవలం కర్నూలు జిల్లా మాత్రమే కాకుండా, పరిసర జిల్లాలు మరియు తెలంగాణ రాష్ట్రం నుండి కూడా పెద్ద సంఖ్యలో రోగులు ఇక్కడికి వస్తున్నారని చెప్పారు. గతంలో నిలిచిపోయిన క్యాన్సర్ యూనిట్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చామని తెలిపారు. ఆసుపత్రిలో జరుగుతున్న నిర్మాణ పనులను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఏపీఎంఐడిసి అధికారులకు సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజ్ సమీపంలో సంవత్సరాలుగా ప్రమాదాలకు కారణమైన బ్లాక్ స్పాట్‌ను మంత్రి సహకారంతో తొలగించడం ద్వారా ప్రజల ప్రాణాలను కాపాడగలిగామని తెలిపారు. అధికారులు మరింత అంకితభావంతో పనిచేయాలని, ప్రజా ప్రతినిధులుగా అభివృద్ధి కార్యక్రమాల్లో పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. మంత్రి ఆధ్వర్యంలో కర్నూలును స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. కర్నూలు జనరల్ ఆసుపత్రి అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందరూ సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించగలమని ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు.

ఈ సందర్భంగా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ , ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంత్రిగారి హస్తాలతో భూమి పూజ జరుపుకున్న తరువాత భవనం నిర్మాణం వారి సహాయంతో త్వరగా పూర్తి అయ్యి ప్రజలకు అందుబాటులోకి రావడం శుభపరిణామని తెలియజేశారు. ల్యాబ్



ఇన్చార్జ్ డాక్టర్ రేణుక మాట్లాడుతూ ఈ భవనాన్ని పూర్తిగా స్ట్రైజ్ చేసి భారీ లాబ్ పరికరాలను ఇందులోకి తీసుకొని వచ్చి మూడు నెలల్లోగా అన్ని సమకూర్చుకొని ప్రజలకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ ,జి జి హెచ్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి , డాక్టర్ హరి చరణ్,వి డి ఆర్ ఎల్ ల్యాబ్ ఇంచార్జి డాక్టర్ రేణుకా దేవి, హాస్పిటల్ కమిటీ మెంబర్ డాక్టర్ ప్రవీణ్, సాయి ప్రదీప్,రీజినల్ ఐ హాస్పిటల్ సూపర్డెంట్ సత్యనారాయణ రెడ్డి, స్టేట్ క్యాన్సర్ యూనిట్ డాక్టర్ ప్రకాష్, న్యూమరాలజీ వైస్ ప్రిన్సిపల్ శ్రీరాములు, ఏపీఎంఐడిసి ఇంజనీర్లు ఇందిర,చిరంజీవులు, జయరాం రెడ్డి పాల్గొన్నారు

## అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరూ అనుసరించాలి

నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 14:- భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను అనుసరించి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తదితరులు ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన జయంతోత్సవ కార్యక్రమాన్ని మంత్రి, కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం.జావళి ఆల్ఫోన్స్, అన్ని సంఘాల నాయకులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, మేకల లింగుస్వామి, దండు వీరయ్య, డివియంసి సభ్యులు నాగభూషణం, డా. బాలస్వామి, కె. చిన్న వెంకటస్వామి, బాలునాయక్, వెంకటసుబ్బయ్య, త్యాగరాజన్, చెన్నమ్మ, లక్ష్మీ, శ్రీనివాసులు, రామచంద్రుడు, సుధాకర్, బాబురావు,శ్రీరాములు తదితరులు పాల్గొని అంబేద్కర్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం గౌరవకరమని తెలిపారు. అంబేద్కర్ సమాజంలో సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లో మరింతగా వ్యాప్తి చేయడానికి నంద్యాలలో అంబేద్కర్ భవనం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ భవనం ద్వారా యువతలో సామాజిక చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని అన్నారు. ప్రజలకు సులభంగా చేరుకునే ప్రదేశంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయన సందేశం విస్తృతంగా వ్యాపిస్తుందని అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ జయంతిని ప్రతి ఒక్కరూ ఐక్యంగా, పండుగ వాతావరణంలో జరుపుకోవాలని, రాజకీయాలకు అతీతంగా ఆయన ఆశయాలను గౌరవించాలని మంత్రి సూచించారు. సమాజంలోని ప్రతి వర్గం అంబేద్కర్ చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఈ



నెలలో బాబూ జగజీవన్ రామ్, జ్యోతిరావు పూలే మరియు భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నామని తెలిపారు. అంబేద్కర్ స్ఫూర్తి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపుపొందిందని, ఆయన ప్రజల అభ్యున్నతి, దేశాభివృద్ధి, సమానత్వ సాధన కోసం చేసిన అపారమైన కృషి అందరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. కుల మతాలకన్నా ప్రజా సంక్షేమమే ముఖ్యమనే సిద్ధాంతంతో ఆయన జీవితం నడిచిందని కొనియాడారు. అంబేద్కర్ చిన్నతనంలో ఎన్నో వివక్షలను ఎదుర్కొన్నప్పటికీ, ఉన్నత విద్యను సాధించి గొప్ప స్థాయికి ఎదిగారని గుర్తుచేస్తూ, నేటి యువత కూడా విద్యను ఆయుధంగా తీసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకుని సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. లా, ఎకనామిక్స్, ఫిలాసఫీ, సోషియాలజీ వంటి అనేక రంగాల్లో ఆయన విశిష్ట పాండిత్యం కలిగిన మహనీయుడని, పుస్తకాలు మరియు పత్రికల ద్వారా సమాజానికి దిశానిర్దేశం చేశారని వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ గారి ఆశయాలకు అనుగుణంగా విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ జిల్లాలో ఏడు అంబేద్కర్ గురుకులాలు, 38 సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువుల పట్ల అంబేద్కర్ కి ఉన్న గౌరవం అపారమని, తన గురువు పేరునే తన పేరుగా పెట్టుకోవడం ద్వారా గురుభక్తిని చాటుకున్నారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'పీ4' కాన్సెప్ట్ ద్వారా పరస్పర సహకారం, సేవాభావం పెంపొందించి అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నామని కలెక్టర్ తెలిపారు. మనమందరం ఒకటిగా, టీమ్ స్పిరిట్‌తో పనిచేస్తే ఏ లక్ష్యాన్నైనా సాధించగలమని ఆమె పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహ స్థాపనకు ఈ ప్రదేశాన్ని ప్రజలే స్వయంగా ఎంచుకోవడం ఆనందకరమని, మున్సిపల్ యంత్రాంగం సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినందుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. అంబేద్కర్ భవన్ నిర్మాణంపై మాట్లాడుతూ, ప్రస్తుత భవనం నాణ్యత తక్కువగా ఉండటంతో మరమ్మత్తులు చేపట్టామని, భవిష్యత్తులో పెద్ద సమావేశాలకు అనుకూలంగా కొత్త భవనం నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. పీవీ నగర్‌లో కొంత భూమి అందుబాటులో ఉందని, ప్రజలు సూచించిన ప్రత్యామ్నాయ స్థలాలను రెవెన్యూ శాఖ ద్వారా పరిశీలించి, భూసేకరణ అనంతరం ప్రభుత్వానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ అవసరాలను ధైర్యంగా ముందుకు వచ్చి తెలియజేయాలని సూచించారు. సమాజ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, కమ్యూనిటీ అవసరాల కోసం ఎవరైనా ముందుకు వస్తే ప్రభుత్వం ఎల్లప్పుడూ స్వాగతిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేక్ కట్ చేసి, వివిధ సంఘాల నాయకులకు పంపిణీ చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహ స్థాపన కార్యక్రమం సందర్భంగా మంత్రి, కలెక్టర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి చింతామణి, జిల్లా అధికారులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సమరసత కోసం పోరాటం సాగించిన ధైర్యశాలి అంబేద్కర్ : నరసింహులు



రాయచోటి, మహిన్యూస్, ఏప్రిల్ 14 : సామాజిక సమరసత కోసం పోరాటం సాగించిన ధైర్యశాలి అంబేద్కర్ అని జిల్లా అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నరసింహులు అన్నారు. మంగళవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసిన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించిన ప్రపంచ మేధావిని పేర్కొన్నారు. గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, జిల్లా మీడియా ఇంచార్జ్ వెంకటేశ్వర్లు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా సిపిఎస్ కన్వీనర్ రమేష్, వివిధ మండలాల అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు సుబ్బరాయుడు, సంబేపల్లి రెడ్డి శేఖర్, వెంకటయ్య, నాగేంద్ర ప్రసాద్, నాగరాజు, జనార్ధన్, ఓబులేసు, అన్నయ్య నాయక్, నాగమణి నాయక్ కలకడ ఆంజనేయులు, రామాపురం మల్లికార్జున, పెద్దవండం చలపతి, మనోహర్, ఏడుకొండలు, లక్కిరెడ్డిపల్లి రామ్మోహన్, గాలివీడు రెడ్డయ్య రాజు తదితర ఆపస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాదు

### - బహుముఖ ప్రజ్ఞాశాలి



రాయచోటి, మహిన్యూస్, ఏప్రిల్ 14: భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా బహుముఖ ప్రజ్ఞాశాలి అని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ బాబు పేర్కొన్నారు. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని రజక సంఘం ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అడుగుజాడలే ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాసులు, పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక సిబ్బంది సేవలు ఆదర్శప్రాయం

### - చమర్తి జగన్ మోహన్ రాజు

### అగ్నిమాపక వారోత్సవాలకు హాజరైన నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు



రాజంపేట. మహిన్యూస్. ఏప్రిల్:14 : రాజంపేట పట్టణం నియోజకవర్గ పార్టీ కార్యాలయం రాజంపేట. అప్రమత్తతతో ఉంటే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. మంగళవారం నాడు రాజంపేట పట్టణం నందు పర్యటిస్తూ అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది సేవలు ఆదర్శప్రాయమని, పకృతి వైపరీత్యాలు,అనుకోని విపత్తులు ఎదురైన సమయంలో వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలనుఆస్తులను కాపాడేది అగ్నిమాపక సిబ్బందేనని కొనియాడారు. అంతేకాకుండా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాజంపేట పట్టణంలో సంభవించిన ఓ భారీ అగ్ని ప్రమాదాన్ని సైతం భారీగా ప్రాణ నష్టం జరగకుండా ఫైర్ సిబ్బంది పని చేశారని ఈ సందర్భంగా వారి సేవలకు గుర్తిస్తూ వారికి ఘనంగా సత్కరించారు. అనంతరం అగ్నిమాపక శాఖ వారు ఏర్పాటు చేసిన పలు రకాల స్టాళ్లను పరిశీలించి,వాటి ఉపయోగాలను చమర్తి జగన్ మోహన్ రాజు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు కి ఫైర్ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్య నాయకులు,ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## రాజ్యాంగ నిర్మాతకు ఎస్.టి.యుఘన నివాళులు



పోరుమామిళ్ల: ఏప్రిల్ 14: మహిన్యూస్.న్యూస్ : ప్రతినిధి: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరు అనుసరించాలని ఎస్టియు కన్వీనర్ వీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్ల మూడు రోడ్ల సర్కిల్ నందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎస్ టి యు కన్వీనర్ వి వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ గారి ఆశయాలను అనుసరించి బడుగు బలహీన వర్గాలను అన్ని రంగాలలో ముందుకు నడిపిశీచడం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బడుగు బలహీనవర్గాల లో ప్రతి ఒక్కరిని ప్రతి అన్ని విధాలుగా ఆదుకోవడశీ ప్రభుత్వ లక్ష్యమమని వారు అన్నారు. పేదరికంలో ఉండే వారినీ ఆదుకోవాలని



ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్వేచ్ఛ సమానత్వం సౌభ్రతత్వం అనే విలువలతో దేశ నిర్మాణానికి బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన సేవలు అపారమని వారు ఆయన సేవలను కొనియాడారు. అంబేద్కర్ గారి ఆశయాలు ప్రతి ఒక్కరికి మార్గదర్శకమని వాటిని కొనసాగించినప్పుడే సమాజంలో ప్రతి ఒక్కరూ స్వతంత్రంగా నిలబడేందుకు ఉన్నత స్థానంలో నిలబడేందుకు అవకాశాలు ఉంటాయని ఆయన ఇచ్చినటువంటి విద్య అను ఆయుధాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని వారు ఆశబావశీ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు

## డి.ఎస్.పి, మురళి, సీఐ శ్రీ రామ్ ను కలిసిన డాక్టర్ కోలా



పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 14: పులివెందుల పట్టణంలోని డి.ఎస్.పి కార్యాలయం లో డి.ఎస్.పి మురళి నాయక్, అర్బన్ పోలీస్ స్టేషన్ లో సీఐ శ్రీరామ్ ను మంగళవారం దళిత ఫెడరేషన్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ మర్యాదపూర్వకంగా మర్యాద పూర్వకంగా వారిని కలసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరిం చుకొని ఆయన జ్ఞాపకార్థం వారికి చిత్రపటాలను అందించడం జరిగిందన్నారు. భారతదేశ పరిస్థితుల అనుగుణంగా దేశంలో ఉండాల్సిన చట్టాలను బిఆర్ అంబేద్కర్ రచించడం జరిగింద న్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు యువత కృషి చేయాలన్నారు. దళితులపై జరిగే దాడులను ఎప్పటికప్పుడు ఖండించడం జరుగుతుందన్నారు. దళితులపై దాడులు జరిగితే పోలీసులు విచారణ జరిపి దళితులకు న్యాయం చేయాలని వారిని కోరారు. అంతకుముందుగా పట్టణంలోని ఆయన కార్యాలయంలో బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన135వజయంతి కేకును కట్ చేసి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# నవభారత నిర్మాతకు... జోహార్లు..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కలెక్టరేట్ లో ఘనంగా డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి మహోత్సవ వేడుక కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్ తదితరులు



కడప, మహి న్యూస్ ఏప్రిల్ 14: నవ భారత రాజ్యాంగ నిర్మాత డా.బి. ఆర్. అంబేద్కర్ అని, ఆయన యావత్ ప్రపంచానికి ఆదర్శనీయం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జోహార్లు అర్పించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి,



డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నవభారత నిర్మాణంలో డా. బి.ఆర్.అంబేద్కర్ పోషించిన పాత్ర విశేషమైనదన్నారు. ప్రపంచానికే ఆదర్శనీయమైన రాజ్యాంగాన్ని రచించిన ఆయన అపర మేధావి, విద్యావంతులు అని కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ త్యాగానికి, కృషికి, మొండి పట్టుదలకు, నిజాయితీకి, నిబద్ధతకు, చిత్తశుద్ధికి, క్రమశిక్షణకు, అకుంఠిత దీక్షాదక్షతకు నిదర్శనం అన్నారు. ఆయన మేధా నిరతికి రెండు చేతులు జోడించి హృదయ పూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. మంచి వ్యక్తిత్వం ఉన్న మహనీయల గురించి ఎన్ని రోజులు ప్రశంశించుకున్నా తరగనిది డా.బి.ఆర్.అంబేద్కర్ మహోన్నత వ్యక్తిత్వం అన్నారు. ప్రతి పౌరుడు.. దేశం పట్ల వారి బాధ్యతలను ఎప్పుడూ కూడా మరువరాదన్నారు. యావత్ ప్రపంచదేశాలు భారత రాజ్యాంగన్ని గౌరవిస్తున్నాయంటే అంబేద్కర్ గారి రాజ్యాంగ రచనా నైపుణ్యం ఎంతటిదో అర్థమవుతోందన్నారు. మన రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమ విలువలతో కూడినదని... ఆ రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రపంచానికే స్ఫూర్తి అన్నారు. విద్యతోనే సమాజం ఉన్నత స్థాయికి ఎదుగుతుందని ప్రపంచానికి తెలియజేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ప్రపంచంలోని దేశాలలో ఎన్నో రకాల ఆర్థిక అసమానతలు, విఫత్తులు ఎదురయి సంక్షోభంలో పడ్డా కూడా.. మన దేశంలో ఆర్థిక స్థిరత్వం ఉంది అంటే.. మన రాజ్యాంగం లోని విధి విధానాలే అన్నారు. కులమతాలకు అతీతంగా ఆయన నిర్మించిన రాజ్యాంగాన్ని గౌరవ ప్రదంగా అనుసరిస్తున్నామని, అంత గొప్ప స్ఫూర్తి దాతకు ప్రతి ఒక్కరం ఋణపడి ఉన్నామని అన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. చదువు ధనానికి మూలం అయితే.. ఆ ధనానికి ఇంధనం చదువు అన్నారు. శుభ్రతే మన అభిమతం.. శుచీ శుభ్రత, చదువు మన జీవితాల మెరుగుదలకు మూలం అని గుర్తు చేశారు. ఆ అభిమాతాలన్నీ మమేకం అయిన మూర్తీభవించిన వ్యక్తి డా. బి.ఆర్. అంబేద్కర్ అని వివరించారు. నవభారత నిర్మాణంలో ఆయన పోషించిన పాత్ర విశేషమైనదన్నారు. తన మేధస్సుతో భారత జాతి నిర్మాణానికి







మార్గదర్శనం చేసిన మహనీయుడని అన్నారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత మూర్తి అన్నారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి డా.బి.ఆర్. అంబేద్కర్ అని, నవభారత నిర్మాణంలో ఆయన పోషించిన పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. డా. అంబేద్కర్ గారి స్ఫూర్తితో నడుస్తున్న రాజ్యాంగ వ్యవస్థలో ప్రస్తుతం మన దేశం ప్రపంచ ఏకానమీలో 5వ స్థానంలో ఉన్నందుకు గర్వాంగా వుందన్నారు. ప్రస్తుత రోజుల్లో విద్య అనేది ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉందని... విద్యను సద్వినియోగం చేసుకుని, వివేకం పెంచుకుంటే.. ప్రతి విద్యార్థి భవిష్యత్తులో మరో అంబేద్కర్ గా ఎదగగలరన్నారు. జిల్లాలో పునరుద్ధరణలో ఉన్న అంబేద్కర్ భవన్ త్వరలో నిర్వహణలోకి తీసుకురానున్నామన్నారు. అలాగే.. ఎస్సి కార్పొరేషన్ పరిధిలోని దళిత భూముల సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తున్నామన్నారు. డిప్యూటీ కలెక్టర్లు కిరణ్ కుమార్, రాకేష్ చంద్రం మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ పరిరక్షణకు భారతీయ పౌరుడిగా కృషి చేయడం మన బాధ్యత అని వారు గుర్తు చేశారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి, అభ్యున్నతిని కాంక్షించి.. 26 నవంబర్ 1949న జాతికి/దేశానికి అంకితం చేసి.. ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవడం జరిగిందన్న విషయాన్ని మనం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వివిధ హోదాల్లో ఎన్నో సేవలు అందించిన ఆయన సేవలు.. యావత్ ప్రపంచానికి స్ఫూర్తి దాయకం అని.. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. చదువు అనేది ప్రగతికి ప్రధాన మెట్టు.. అన్ని వర్గాల వారికీ అవసరమైన అవసరాలను, హక్కులను పొందుపరిచిన రచించిన రాజ్యాంగ గ్రంథం.. భవిస్యతరాలకు కూడా మార్గదర్శం అని గుర్తు చేశారు. వ్యవస్థను నిర్మించడం ఒక ఎత్తయితే.. ఆ వ్యవస్థను నడిపించడం అంతే ముఖ్యం అన్నారు. కార్యక్రమానికి ముందుగా.. ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి.. అనంతరం రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ ప్రాంగణంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు, రాష్ట్ర ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్ తదితరులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, కడప ఆర్డీవో మురళి, జెడ్పి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎస్డీసి వెంకటపతి, డిఆర్డీఏ, కేఎంసి కమిషనర్ రాకేష్ చంద్రం, మెప్మా పిడీలు రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, తదితర జిల్లా అధికారులతో పాటు.. పలువురు ప్రజా, కుల సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, కలెక్టర్ లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజనీతి కోవిదుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,డాక్టర్ బి ఆర్ అంబేద్కర్

### రాజనీతి కోవిదుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ .

### అత్తింజేరి శ్రీనాథ్

### ఏపీసీసీ కార్యవర్గ సభ్యులు





రాజంపేట. మహిన్యూస్. ఏప్రిల్:14: మంగళవారం రాజంపేట పట్టణంలో ఎన్ టి ఆర్ సర్కిల్ వద్ద డాక్టర్ బి .ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయిన మీడియాతో మాట్లాడుతూ రాజనీతి కోవిదుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ నిరంతరం దేశ ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి డాక్టర్.బి ఆర్ అంబేద్కర్ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వాల మేలుకలయిక మన అంబేద్కర్ గారు. రాజ్యాంగంలో హక్కులే పునాదులు అని, అన్ని మతాలు, కులాల మధ్య సమానత్వం ఉండాలని, కోట్లాది పీడిత ప్రజల ఆశయాలను, వారి హక్కులను కాపాడాలనేది అంబేద్కర్ గారి ఆశయం. బీజేపీ అంబేద్కర్ గారి ఆశయాలకు తూట్లు పొడుస్తుంది. ఆర్. ఎస్. ఎస్ భావజాలానికి పెద్ద పీట వేస్తోంది. భారత రాజ్యాంగాన్ని మార్చి మనుస్మృతి అమలు చేసే కుట్ర చేస్తోంది. ఇవ్వాళ దేశంలో అమల్లో ఉన్నది అంబేద్కర్ గారు రాసిన రాజ్యాంగం కాదు. మోడీ దోస్తులు అదానీతో కలిసి రాసుకున్న మోదానీ రాజ్యాంగం. లౌకిక వాదాన్ని పక్కన పెట్టి మతం పేరుతో మంటలు రేపుతున్నారు. విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య వైషమ్యాలను సృష్టిస్తున్నారు. రక్తపాతం సృష్టించి శవాల మీద రాజకీయం చేస్తున్నారు. నేల,నింగి,నీరు అనే తేడా లేకుండా దేశ సంపదను బీజేపీ నాయకులు దోచుకుతింటున్నారు. అంబేద్కర్ గారి ఆశయాలు నెరవేరాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ దేశానికి బీజేపీ నుంచి విముక్తి లభించిన నాడే మహనీయుడు అంబేద్కర్ గారికి నిజమైన నివాళులు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో డీసీసీ నాయకులు శ్రీనివాసులు, వెంకటేష్, భానుప్రకాష్, బెనర్జీ, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## దళితులు అంటే ఎందుకు నీకు అంత చులకన బీటెక్ రవి

### దళితులకు బీటెక్ రవి, క్షమాపణ చెప్పాలి



పులివెందుల మహి న్యూస్ ఏప్రిల్ 14: బీటెక్ రవి దళితులు అంటే నీకు ఎందుకు అంత చులకన అని,దళితులను అవమానించేలా వ్యాఖ్యానించడం చాలా బాధాకరమని, దళితుల కు వెంటనే బీటెక్ రవి క్షమాపణ చెప్పాలని, మునిసిపల్ మాజీ చైర్మన్ వల్లెపు వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకులు కోళ్ల భాస్కర్, వైసిపి నాయకులు కృష్ణ మూర్తి, మాజీ కో ఆప్షన్ సభ్యులు దాసరి చంద్రమౌళి, బీసీ నాయకులు కార్తీక్ , అంజి, రవి, కలందర్,లు అన్నారు. మంగళవారం వారు పగలగొట్టిన బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేసి జై భీమ్ అని నినాదాలు చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ దళితులను కించపరిచేలా చిల్లర చేష్టలు అని వ్యాఖ్యలు చేసిన బీటెక్ రవి తక్షణమే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. 2015లో ఇక్కడ అంబేద్కర్ విగ్రహాన్ని వైయస్ కుటుంబీకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం అంబేద్కర్ వర్ధంతి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించ డం వైయస్ అవినాష్ రెడ్డి సహకారంతో అల్పాహా రం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుంద న్నారు. అంబేద్కర్ అందరివాడు అన్నారు. మీరు కూడా ఇక్కడ అల్పాహారం ఏర్పాటు చేయవచ్చు భోజనాలు ఏర్పాటు చేయవచ్చు అన్నారు. ఏరోజైనా నువ్వు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసావా అని వారు ప్రశ్నించారు. ముందు రోజు అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించి విగ్రహాన్ని ఏరోజైనా కడిగించావా అని వారన్నారు. దళితులు అందరూ కలసి అలంకారం చేస్తే వచ్చి పూలదండ లు వేయడం ఎవరైనా చేస్తారన్నారు.బీటెక్ రవి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం బహుషా మొదటి సారి కావడం వలన ఈ ఫ్లెక్సీలు, షామియానాలు కొత్తగా కనిపించి ఉండవచ్చు వారు అన్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున అంబేద్కర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు కచ్చితంగా విగ్రహానికి అలంకరణ, పూల మాలలు వేయడం అనవాయితీగా వస్తోంది అని తెలిపారు.అంబేద్కర్ జయంతి సందర్భంగా అల్పాహారం ఏర్పాటు చేసే కార్యక్రమం లో భాగంగానే షామియానా వేయడం జరిగింది అన్నారు.అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కు ఖర్చు మొత్తం భరించిన వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి, వైయస్ అవినాష్ రెడ్డి కి కృతజ్ఞతగా 135 వ అంబేద్కర్ జయంతి సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి, ఫోటోలు ఉన్న బ్యానర్లు వేయడం జరిగింది అన్నారు.మీ పార్టీ లోనే కాదు మా పార్టీ లో కూడా బీపీ వచ్చే వారు ఉంటారు. మాట్లాడే సమయం లో భాద్యత గా హుందాగా వ్యవహరించాలి అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ జయంతి ఉత్సవాల కు ముందస్తుగా పోలీస్ ల అనుమతి కూడా తీసుకోవడం జరిగింది అని గుర్తు చేశారు. ఇన్ని ఏళ్లలో ఏ రోజే గాని పోలీస్ పర్మిషన్ తీసుకున్న రోజులే లేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు లోనే మాకు ఈ దౌర్భాగ్యం పట్టిందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం దగ్గరకు వచ్చి నివాళులు అర్పించకుండా రాజకీయాలు మాట్లాడటం నీ దిగజారుడు తనానికి నిదర్శనమ న్నారు. దళితులను కించపరిచేలా చిల్లర చేష్టలు అని వ్యాఖ్యలు చేసిన బీటెక్ రవి, దళితులుగా పుట్టాలని ఎవ్వరైనా కోరుకుంటారా అని వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు కు మంచి బుద్ధి ప్రసాదించాలని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com